టాప్ న్యూస్

## విజయ్‌కి ఫోన్ చేసిన రాహుల్ గాంధీ

- టీవీకే పార్టీ అద్భుత విజయం సాధించిందన్న రాహుల్ గాంధీ
- ప్రస్తుతం యువగళం పెరుగుతోందని వ్యాఖ్య



02

## కర్నాటకలో కాంగ్రెస్ జోరు

- రెండు బైపోల్స్ లో విక్టరీ



02

## ఇది గెలుపు కాదు లూటీ

- బెంగాల్‌లో షాకింగ్ తీర్పుపై మమతా బెనర్జీ



02

ANN తెలుగు
Follow: @ANNTELUGU
05-05-2026
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 128 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



# కేసీఆర్‌కు పవర్ షాక్

### భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ ప్లాంట్ల అక్రమాలపై సీబీఐ
### రాష్ట్ర కేబినెట్ సంచలన నిర్ణయం
### ఒకే గొడుగు కిందకు ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలు

**హైదరాబాద్, మహా:** గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణంలో చోటుచేసుకున్నట్లు భావిస్తున్న భారీ అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో విచారణ జరిపించాలని రాష్ట్ర మంత్రివర్గం సంచలన నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఈ వ్యవహారంపై తొలుత జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి, ఆ తర్వాత జస్టిస్ మదన్ బి. లోకూర్ కమిషన్ విచారణ జరిపి 2024 అక్టోబర్‌లో ప్రభుత్వానికి 114 పేజీల సమగ్ర నివేదికను సమర్పించిన విషయం తెలిసిందే. ఈ నివేదికపై అడ్వకేట్ జనరల్ (ఏజీ) న్యాయ సలహాను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. ఇందులో అంతర్రాష్ట్ర వ్యవహారాలతో పాటు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రమేయం ఉన్నందున నిష్పాక్షిక దర్యాప్తు కోసం కేసును సీబీఐకి అప్పగించడమే సముచితమని భావించింది. దర్యాప్తు బదిలీ ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలని అధికారులను కేబినెట్ ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువలను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సవరించాలని (రేషనలైజేషన్) కేబినెట్ నిర్ణయించింది.

మిగతా 2లో

## ప్రజాతీర్పు
















# దేశంలో మార్పు గాలి



### ముగ్గురు సీఎంలను ఓడగొట్టిన ప్రజలు
### తమిళనాట విజయ్ ప్రభంజనం

సింహంలా.. సింగిల్ గా వచ్చి.. హిస్టరీ

తన సీటు కూడా గెలవలేకపోయిన స్టాలిన్

మమత కు గుడ్ బై చెప్పిన బెంగాల్

పదేళ్ళకు నెరవేరిన మోదీ అమిత్ షా పంతం

విజయన్ తో దేశంలో కామ్రేడ్ల పాలనకు తెర

కేరళలో లెఫ్ట్ పై కాంగ్రెస్ కూటమి సూపర్ విక్టరీ

అస్సాంలో హిమంత.. పుదుచ్చేరిలో రంగస్వామి

సౌత్ లో.. మరోసారి ఫలించని కమలం అంచనాలు

(మహా నెట్ వర్క్- చెన్నై, తిరువనంతపురం, కోల్ కత) : దేశంలో మార్పుగాలి వీచింది. వరుస విజయాలతో.. రాజకీయదిగ్గజాలుగా ఉన్న హేమాహేమీలైన సీఎంలను.. ప్రజలు ఇంటికి సాగనంపారు. ఎంతో ఘనచరిత్ర కలిగిన డీఎంకే అధినేత స్టాలిన్ తాను కూడా గెలవలేక బొక్కబోర్లా పడ్డారు. అధికారం కోల్పోయి దారుణ పరాభవం మూటగట్టుకుంది. పార్టీ ప్రకటించడమే కాకుండా అరంగేట్రంలోనే అదరగొట్టి టీవీకే అధినేత విజయ్ సీఎం కాబోతున్నారు. అంచనాలను తలక్రిందులు చేసి.. విజయ్ ఈవీఎం బాక్సుల్లో సింహంలా గర్జించారు. బాక్సాఫీస్ ను మించి.. ఓట్లు కొల్లగొట్టారు. బెంగాల్ లో మమతకు ఓటర్లు బైబై చెప్పారు. మోదీ అమిత్ షా చెప్పినట్లే కాషాయజెండా రెపరెపలాడించారు. కేరళలో రాహుల్ హవా కనిపించింది. కాంగ్రెస్ కూటమి ఏకపక్ష విజయాన్ని అందుకుంది. కామ్రేడ్ల పాలనకు దేశంలోనే ముగింపు పలికింది. గత యాభై ఏండ్లలో దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా కమ్యూనిస్టుల పాలన లేకపోవడం ఇదే ఫస్ట్ . నీపోమోని విజయన్ అంటూ రేవంత్ సీఎం విజయన్ ను ముగ్గులోకి లాగి ఓడించారు. అస్సాంలో బీజేపీ సీఎం హిమంత బిశ్వశర్మ మరోసారి మ్యాజిక్ రిపీట్ చేశారు. పుదుచ్చేరి సీఎంగా ఎన్ ఆర్ కాంగ్రెస్ అధినేత రంగస్వామి ఐదోసారి బాధ్యతలు స్వీకరించబోతున్నారు. దుర్భేద్యం అనుకున్న కోటలను కూల్చి దేశ రాజకీయాల్లో సరికొత్త మార్పును ప్రజలు కోరుకున్నారు. సౌత్ లో కమలం అంచనాలు తప్పగా, బెంగాల్ లో సూపర్ విక్టరీని సొంతం చేసుకుంది. మమత పదిహేనేళ్ళ కోటను కూల్చి బీజేపీ గ్రాండ్ సక్సెస్ అయింది.

- ఐదురాష్ట్రాలలో ప్రజాతీర్పుపై మహా పత్రిక ప్రత్యేక కథనాలు



## కేరళంలో రేవంత్ మ్యాజిక్

- ఎర్రకోటకు బీటలు
- చెప్పినట్లే.. విజయన్ ఇంటికి
- మలయాళ మట్టిలో రగిలిన తెలంగాణ నిప్పు
- విజయన్ కోటను కూల్చిన రేవంత్ రెడ్డి వ్యూహం
- స్టార్ క్యాంపెయినర్ గా అటెన్షన్ తిప్పకున్న సీఎం
- జాతీయస్థాయిలో పెరిగిన రేవంత్ ఇమేజ్

**మహా ప్రత్యేకం:** దశాబ్ద కాలంగా అప్రతిహతంగా సాగుతున్న ఎర్రజెండా పాలనకు.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూపంలో ఒక రాజకీయ పిడుగు తగిలింది. కేవలం ప్రచారకర్తగా వెళ్ళిన రేవంత్, అక్కడ ఒక 'పొలిటికల్ స్టార్'గా అవతరించి, కాంగ్రెస్ విజయకేతనానికి ఊపిరి పోశారు. కేరళలో తెలంగాణ సీఎం రేవంత్ మ్యాజిక్ పని చేసింది. స్టార్ క్యాంపెయినర్ గా ప్రచారానికి వెళ్ళి.. తన ప్రసంగంతో అనూహ్యంగా ప్రచారాన్ని తనవైపుకు తిప్పుకుని ప్రత్యర్థిపార్టీని బోల్తా కొట్టించాడు. కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ప్రభంజనం సృష్టించింది.

మిగతా 2లో

## విజయ్ సునామీ

- కుర్చీ మనదే బిగిలూ
- ఎంజీఆర్.. ఎన్టీఆర్ తరహాలో
- అరంగేట్రంతోనే అద్భుతం
- తమిళ రాజకీయాల్లో కొత్తశకం
- క్లియర్ ఐడియాలజీ, క్లీన్ ఇమేజ్ అభ్యర్థులు ప్లస్ పాయింట్



వివరాలు 2లో



**బెంగాల్‌లో ఫలించిన మోదీ, షా వ్యూహం** | **మమతకు దారుణ పరాజయం** 2లో

# కేసీఆర్‌కు పవర్ షాక్

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుత మార్కెట్ ధరలకు, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువలకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటం, అభివృద్ధి పనుల్లో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు ఇస్తున్న పరిహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. శాస్త్రీయ పద్ధతిలో ధరల సవరణ చేసేలా రిజిస్ట్రేషన్ శాఖకు పచ్చజెండా ఊపారు. జిల్లాస్థాయిలోని కమిటీలు క్షేత్రస్థాయి పరిస్థితులను బేరీజు వేసుకుని ఈ నెలాఖరు నాటికి నూతన విలువలను అమల్లోకి తేనున్నాయి. మరోవైపు, 'హిల్ట్' (HILT) పాలసీ కింద దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. భూముల ధరలు పెరిగేలోపే దరఖాస్తు చేసుకున్న వారు ప్రాథమికంగా 10 శాతం మొత్తాన్ని చెల్లిస్తే, పాత ధరలనే వర్తింపజేయాలని నిర్ణయించింది. మిగిలిన 90 శాతం నిధులను 90 రోజుల్లోగా చెల్లించేలా వెసులుబాటు కల్పించింది. గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎంసీ), సైబరాబాద్, మల్కాజిగిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీల పరిధిలో పేరుకుపోయిన ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్నుల బకాయిల వసూలుకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకానికి కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. దాదాపు రూ.5,864 కోట్లుగా ఉన్న ఈ బకాయిలపై వడ్డీలు, జరిమానాలు పూర్తిగా మాఫీ చేసి, అసలు మొత్తం రూ.1,686 కోట్లను ఓటీఎస్ కింద వసూలు చేయాలని మున్సిపల్ శాఖను ఆదేశించింది. జలమండలికి చెల్లించాల్సిన నీటి బిల్లుల బకాయిలను సైతం ఇందులో సర్దుబాటు చేయనున్నారు. అలాగే, రాష్ట్రంలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి మంత్రులను ఆదేశించారు. ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు వెంటనే పంట నష్టం వివరాలు తెప్పించుకుని సహాయక చర్యలు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. రైతులు, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్ నగర్‌లో 42 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో అత్యాధునిక కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధిని ఒకే గొడుగు కిందకు తెచ్చే దిశగా కీలక అడుగు పడింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఐటీఐలు (అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు), పాలిటెక్నిక్ కళాశాలలు, టీశాట్ వ్యవస్థలను నూతనంగా ఏర్పాటైన 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' పరిధిలోకి తీసుకురావాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు తక్షణమే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది. పాడి రైతుల సంక్షేమం కోసం నల్గొండరంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘాన్ని (నార్మాక్ ) నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డుకు (ఎన్‌డీడీబీ) అప్పగించే ఒప్పందానికి పచ్చజెండా ఊపింది. ఇకపై డైరీ ప్లాంట్ నిర్వహణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ బాధ్యతలను ఎన్‌డీడీబీనే పర్యవేక్షించనుంది. సాగునీటి రంగానికి సంబంధించి ఖమ్మం జిల్లా కామేపల్లి వద్ద బుగ్గవాగు నుంచి లెఫ్ట్ ఫ్లడ్ ఫ్లో కాలువ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. దీనిద్వారా జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు సమృద్ధిగా నీరు అందనుంది. హరిత విద్యుత్ ఉత్పత్తిలో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని 9 జిల్లాల పరిధిలో ఉన్న 18 చోట్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ల వద్ద సోలార్ పవర్ జనరేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. రూ.66.50 కోట్ల అంచనా వ్యయంతో 19 మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంగా ఈ ప్రాజెక్టులను అమలు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది.

# విజయ్ సునామీ



**చెన్నై, మహా:** తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త శకం ప్రారంభమైంది. ఐదు దశాబ్దాలుగా డీఎంకే-అన్నాడీఎంకే మధ్యే తిరిగిన అధికారం, ఇప్పుడు నవ నాయకుడి చేతికి చేరింది. సినీ రంగంలో అపారమైన ప్రజాదరణ పొందిన తళపతి విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) తొలి ఎన్నికల్లోనే చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయానికి దారి తీసిన అంశాలపై మహాపత్రిక ప్రత్యేక కథనం. తమిళనాటలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ద్విపార్టీ వ్యవస్థపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగింది. 1967 నుంచి రాష్ట్రంలో ప్రధానంగా డీఎంకే లేదా అన్నాడీఎంకే మాత్రమే అధికారంలో ఉండటం, అవినీతి ఆరోపణలు, కుటుంబ పాలన వంటి అంశాలు ఓటర్లలో విసుగును పెంచాయి. ఈ పరిస్థితుల్లో బలమైన మూడో ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు టీవీకే ఆశాకిరణంగా కనిపించింది. ఎపుడొచ్చామన్నది కాదన్నయ్యా బుల్లెట్ దిగిందా లేదా అన్నట్లు అరంగేట్రంలోనే అదరగొట్టారు. ఎంజీఆర్, ఎన్టీఆర్ తరహాలో పోటీచేసిన తొలిసారే విజయభేరి మోగించి విజయుడయ్యారు. కుర్చీమనదే బిగిలూ అనేశారు.

### సింపుల్.. హంబుల్

విజయ్ వ్యక్తిగత నిర్ణయాలు కూడా పార్టీ విజయానికి కీలకంగా మారాయి. తన కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే కోట్లాది రూపాయల రెమ్యునరేషన్ వచ్చే సినిమాలను పూర్తిగా వదిలేయడం ఆయనపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచింది. ప్రజాసేవకే ప్రాధాన్యం ఇస్తున్నానని ఇచ్చిన సందేశం ఓటర్లను బలంగా ఆకట్టుకుంది. ఇక సిద్ధాంత పరంగా కూడా టీవీకే స్పష్టమైన దిశను చూపించింది. మత, కుల విభజనలకు దూరంగా ఉండే సెక్యులర్ భావజాలం, సామాజిక న్యాయం, సమానత్వం వంటి అంశాలను ముందుకు తీసుకెళ్లింది. పెరియార్, కామరాజర్, అంబేద్కర్ ఆలోచనలను సమన్వయం చేస్తూ అన్ని వర్గాలను ఆకర్షించే ప్రయత్నం చేసింది. విజయ్‌కు ఉన్న భారీ ఫ్యాన్ బేస్ ఈ ఎన్నికల్లో ప్రధాన బలం అయింది. సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విజయ్ మక్కల్ ఇయక్కం క్రమంగా శక్తిమంతమైన రాజకీయ క్యాడర్‌గా మారింది. రక్తదాన శిబిరాలు, విద్యా సహాయం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు వంటి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయి. యువత మద్దతు టీవీకే విజయానికి కీలకం. మొదటిసారి ఓటు వేసిన యువత పెద్దఎత్తున విజయ్‌కు మద్దతు తెలిపారు. ఉద్యోగ అవకాశాలు, విద్యా సంస్కరణలు, పారదర్శక పరీక్షా విధానం వంటి హామీలు వారికి ఆకర్షణీయంగా మారాయి. మహిళల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు కూడా సైలెంట్ ఓటును టీవీకే వైపు మళ్లించాయి.

### బలహీనమైన అన్నాడీఎంకే

అన్నాడీఎంకేలో విభజనలు, బలమైన నాయకత్వం లేకపోవడం కూడా టీవీకేకు కలిసి వచ్చింది. ఆ పార్టీ ఓటు బ్యాంక్‌లో పెద్ద భాగం విజయ్ వైపు మళ్లింది. అదే సమయంలో డీఎంకేపై ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత కూడా టీవీకేకు లాభించింది. మేనిఫెస్టో విషయంలో కూడా టీవీకే ప్రత్యేకత చూపించింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధానానికి బదులుగా, జిల్లాల వారీగా స్థానిక సమస్యలపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. రైతులు, మత్స్యకారులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రత్యేక పరిష్కారాలు సూచించింది. అభ్యర్థుల ఎంపికలో కూడా టీవీకే వినూత్న నిర్ణయాలు తీసుకుంది. రాజకీయ నేపథ్యం లేని విద్యావంతులు, డాక్టర్లు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలకు అవకాశాలు ఇచ్చింది. అవినీతి మచ్చలేని క్లీన్ ఇమేజ్ ఉన్న అభ్యర్థులు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచారు. మొత్తానికి, ప్రజల్లో మార్పు కోరికను అర్థం చేసుకుని, సరైన సమయంలో బలమైన ప్రత్యామ్నాయంగా ముందుకు వచ్చిన టీవీకే ఈ విజయాన్ని సాధించింది. ఈ ప్రభంజనం కేవలం తమిళనాడు రాజకీయాలనే కాదు, భవిష్యత్తులో జాతీయ రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపే అవకాశముంది.

### డిజిటల్ క్యాంపెయిన్

డిజిటల్ ప్రచారం కూడా పార్టీకి బలంగా పనిచేసింది. సోషల్ మీడియా వేదికల్లో విజయ్ అభిమానులు ముందుండి ప్రచారం నిర్వహించారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ ద్వారా పార్టీ సిద్ధాంతాలు, మేనిఫెస్టో ప్రజలకు చేరేలా చేశారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రభావం చూపింది. విజయ్ వ్యక్తిత్వం కూడా ఓటర్లను ఆకట్టుకుంది. సాధారణ జీవనశైలి, ప్రజల్లోకి వెళ్లి మమేకం కావడం, అభిమానులతో దగ్గర సంబంధం పెట్టుకోవడం వంటి లక్షణాలు ఆయనను ప్రజలకు మరింత దగ్గర చేశాయి. అన్నాగా పిలిచే ఈ అనుబంధం ఓట్ల రూపంలో ప్రతిఫలించింది.

# బెంగాల్‌లో ఫలించిన మోదీ, షా వ్యూహం

## మమతకు దారుణ పరాజయం



**మహా నెట్ వర్క్.:**

పశ్చిమ బెంగాల్ రాజకీయ యవనికపై కమలం వికసించింది. దశాబ్దన్నర పాటు తిరుగులేని ఆధిపత్యం చలాయించిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కంచుకోటలు బద్దలయ్యాయి. 'మా, మాటీ, మానుష్' (తల్లి, మట్టి, మనుషులు) అనే నినాదంతో ఒకప్పుడు అధికార పీఠాన్ని అధిష్టించిన మమతా బెనర్జీ సర్కార్.. నేడు అదే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో తృటిలో చేజారిన అధికారాన్ని, 2026 నాటికి పక్కా వ్యూహంతో బీజేపీ కైవసం చేసుకుంది. అఖండ మెజారిటీతో బెంగాల్ రాజకీయాల్లో కాషాయ దళం సరికొత్త చరిత్రాత్మక అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా వామపక్షాలు, ఆ తర్వాత టీఎంసీ చేతుల్లో బందీ అయిన బెంగాల్ పాలన తొలిసారిగా బీజేపీ వశమైంది.

### అవినీతి ఊబిలో అధికార పార్టీ

బెంగాల్‌లో బీజేపీ ప్రభంజనానికి, టీఎంసీ పతనానికి ప్రధాన కారణం అధికార పార్టీపై కట్టలు తెంచుకున్న ప్రజా వ్యతిరేకతే. పదిహేనేళ్ల సుదీర్ఘ పాలనలో కింది స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి మంత్రుల వరకు అందరిపైనా వచ్చిన అవినీతి ఆరోపణలు ప్రజల్లో తీవ్ర అసహనాన్ని రగిల్చాయి. ముఖ్యంగా రాష్ట్రంలో సంచలనం సృష్టించిన స్కూల్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ఉపాధ్యాయ నియామకాల కుంభకోణం, రేషన్ పంపిణీలో అక్రమాలు, బొగ్గు, ఇసుక మాఫియా దందాలు ప్రభుత్వ ప్రతిష్ఠను పాతాళానికి దిగజార్చాయి. ఏకంగా కీలక మంత్రులు, నేతల ఇళ్లలో గుట్టలుగుట్టలుగా కరెన్సీ కట్టలు పట్టుబడటం సగటు మధ్యతరగతి, విద్యావంతుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కట్టలు తెంచుకునేలా చేసింది. ఈ తీవ్ర వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలచుకోవడంలో బీజేపీ వంద శాతం సఫలమైంది.

### మహిళల ఆగ్రహం.. టీఎంసీకి శాపం

ఇన్నాళ్లు మమతా బెనర్జీకి వెన్నెముకగా నిలిచిన మహిళా ఓటర్లు ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి పూర్తిగా దూరమయ్యారు. సందేశ్‌ఖాలీలో టీఎంసీ స్థానిక నేతలు సాగించిన భూకబ్జాలు, మహిళలపై జరిగిన దారుణ అకృత్యాలు దేశవ్యాప్తంగా పెను సంచలనంగా మారాయి. దీనికి తోడు కోల్‌కతాలోని ఆర్.జి.కర్ ఆసుపత్రిలో మహిళా వైద్యురాలిపై జరిగిన అమానుష హత్యాచార ఘటనపై ప్రభుత్వం వ్యవహరించిన తీరు, నిందితులను వెనకేసుకొచ్చిన వైనం విమర్శల పాలైంది. మహిళల రక్షణలో దీదీ సర్కార్ పూర్తిగా విఫలమైందన్న భావన ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'లక్ష్మీ భండార్' వంటి ఉచిత పథకాలు సైతం మహిళల భద్రత ముందు తేలిపోయాయి. ఆ వర్గం ఓట్లన్నీ సైలెంట్‌గా బీజేపీ వైపు మళ్లాయి.

### కలిసొచ్చిన సీఏఏ.. హిందూ ఓట్ల ఏకీకరణ

ఈ చారిత్రక విజయంలో బీజేపీ వ్యూహాత్మకంగా సాధించిన హిందూ ఓటు బ్యాంకు ఏకీకరణ కీలక పాత్ర పోషించింది. టీఎంసీ కేవలం మైనార్టీలను ప్రసన్నం చేసుకునే రాజకీయాలు చేస్తోందన్న బీజేపీ ప్రచారం మారుమూల గ్రామాల్లోకి సైతం బలంగా చొచ్చుకుపోయింది. కేంద్రం అమలు చేసిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) బంగ్లాదేశ్ నుంచి వచ్చిన మతువా సమాజం, ఇతర శరణార్థుల్లో బీజేపీపై అపారమైన విశ్వాసాన్ని పాదుకొల్పింది. దశాబ్దాలుగా వారు కంటున్న పౌరసత్వ కల నెరవేరుతుందన్న భరోసాతో నదియా, ఉత్తర 24 పరగణాలు, దక్షిణ 24 పరగణాల జిల్లాల్లో బీజేపీకి ఓట్లు బ్రహ్మరథం పట్టాయి. అదే సమయంలో నకిలీ ఓట్ల తొలగింపుతో జరిగిన ఓటరు జాబితా ప్రక్షాళన కూడా పారదర్శకతను పెంచి రికార్డు స్థాయి పోలింగ్‌కు దారితీసింది.

### ప్రత్యామ్నాయం లేక.. డబుల్ ఇంజిన్ వైపు మొగ్గు

ఒకప్పుడు బెంగాల్‌ను ఏలిన వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలు ఈ ఎన్నికల్లో ఏమాత్రం ప్రభావం చూపలేక నామమాత్రంగా మిగిలిపోయాయి. ఆయా పార్టీల బలహీనత బీజేపీకి పరోక్షంగా బాగా కలిసొచ్చింది. టీఎంసీపై రగిలిపోతున్న ఓటర్లు ఆ ఓట్లను వేరే పార్టీలకు వేసి వృథా చేయకుండా, నేరుగా బలమైన ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్న బీజేపీకే గుద్దుడి గుద్దారు. దీంతో ప్రతిపక్ష ఓటు చీలిక జరగకుండా ఏకపక్ష లాభం బీజేపీ ఖాతాలో పడింది. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే పార్టీ ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందన్న 'డబుల్ ఇంజిన్ సర్కార్' నినాదాన్ని ప్రజలు బలంగా విశ్వసించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ప్రగతిని బెంగాల్ దుస్థితితో పోలుస్తూ ప్రధాని మోదీ చేసిన ప్రసంగాలు ఓటర్లను ఆలోచింపజేశాయి.

### పక్కా వ్యూహం.. మోదీ, షాల దిశానిర్దేశం

గత ఎన్నికల చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి బీజేపీ జాతీయ నాయకత్వం అత్యంత పకడ్బందీ వ్యూహంతో అడుగులు వేసింది. ఒకప్పుడు టీఎంసీలో నంబర్ టూగా ఉండి, ఆ పార్టీ లోటుపాట్లన్నీ తెలిసిన విపక్ష నేత సువేందు అధికారి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో సఫలమయ్యారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా రంగంలోకి దిగి బూత్ స్థాయి వరకు పర్యవేక్షణ చేయడం పార్టీ క్యాడర్‌లో నయా జోష్ నింపింది. ప్రధాని నరేంద్ర మోదీ సుడిగాలి పర్యటనలు, మమతా బెనర్జీ లక్ష్యంగా చేసిన భావోద్వేగ ప్రసంగాలు కాషాయ శ్రేణులను ఉర్రూతలూగించాయి. అవినీతి, మహిళల భద్రత వంటి అంశాలను పక్కనబెట్టి అహంకారంతో వ్యవహరించిన టీఎంసీ చివరకు పరాజయం పాలవ్వగా.. క్షేత్రస్థాయి వ్యూహాలు, పకడ్బందీ ప్రణాళికలతో బీజేపీ బెంగాల్ గడ్డపై కమలాన్ని వికసింపజేసింది.

# కేరళంలో రేవంత్ మ్యాజిక్

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం 140 స్థానాలకు గానూ.. కాంగ్రెస్ కూటమి దాదాపు సెంచరీ కొట్టేసింది. దశాబ్ద కాలంగా కేరళను ఏలుతున్న పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కేవలం 35 స్థానాలకే పరిమితమై డీలా పడింది. కేరళలో కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా పర్యటించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి .. పినరయి విజయన్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తిరువనంతపురంలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మలయాళ మూవీలోని ఫేమస్ డైలాగ్‌ను వాడుతూ.. 'నీ పోమోనే విజయన్' (ఇక వెళ్లు విజయన్.. నీ సమయం ముగిసింది) అంటూ ఎద్దేవా చేశారు. పినరయి విజయన్ పొలిటికల్ ఎక్స్‌పైరీ డేట్ ముగిసిందని ఆయనను కేరళ ప్రజలు ఇంటికి పంపడం ఖాయమని రేవంత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.



### వ్యూహకర్తగా.. వాగ్ధాటిగా..

రేవంత్ రెడ్డి కేవలం ప్రసంగాలకే పరిమితం కాలేదు; ప్రత్యర్థి బలహీనతలపై దెబ్బకొట్టారు:

### చీకటి ఒప్పందాల బట్టబయలు:

విజయన్ కి, బీజేపీకి మధ్య ఉన్న 'అంతర్గత మైత్రి'ని ఆయన ఎండగట్టిన తీరు మైనారిటీ ఓటర్లను ఆలోచింపజేసింది.

### అవినీతిపై గర్జన:

ఎల్డీఎఫ్ ప్రభుత్వ వైఫల్యాలను, నిరుద్యోగ సమస్యను తనదైన శైలిలో ప్రజల్లోకి తీసుకెళ్లారు. యూడీఎఫ్ శ్రేణుల్లో తెలంగాణ గెలుపు స్ఫూర్తిని నింపి, వారిని ఎన్నికల సమరయోధులుగా మార్చారు.

### జాతీయ స్థాయిలో ఎగిసిన రేవంత్ గ్రాఫ్

ఈ ఫలితాలతో రేవంత్ రెడ్డి పేరు దేశవ్యాప్తంగా మారుమోగుతోంది. ఒక రాష్ట్ర సీఎం మరో రాష్ట్రంలోకి వెళ్లి, అక్కడ అధికార పార్టీని గద్దె దించడంలో కీలక పాత్ర పోషించడం రేవంత్ రెడ్డి రాజకీయ పరిణితికి నిదర్శనం.

### దక్షిణాది దళపతి:

రాబోయే రోజుల్లో దక్షిణాదిలో కాంగ్రెస్ పార్టీని నడిపించే తిరుగులేని శక్తిగా ఆయన ఆవిర్భవించారు.

### మ్యాజిక్ ఫిగర్:

140 స్థానాల్లో దాదాపు సెంచరీ కొట్టి కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించడంలో రేవంత్ వేసిన 'మార్క్' స్పష్టంగా కనిపిస్తోంది.

### నీపోమోనే విజయ్ అంటూ..

'కేరళ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. నీ మూటముల్లె సర్దుకుని ఇంటికి వెళ్లాల్సిన సమయం వచ్చింది' అని విజయన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తెలంగాణలో ఏ విధంగానైతే కేసీఆర్‌ను గద్దె దించామో.. కేరళలోనూ విజయన్ ఇంటికి పంపి కాంగ్రెస్‌ను గెలిపిస్తామని ఆయన సవాల్ చేశారు. రేవంత్ రెడ్డి చేసిన ఈ ఘాటు వ్యాఖ్యలకు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా అదే స్థాయిలో స్పందించారు. కేరళ అభివృద్ధి సూచీలను, తెలంగాణ అభివృద్ధిని పోలుస్తూ రేవంత్ రెడ్డికి ట్విట్టర్ వేదికగా చురకలు అంటించారు. మూసీ ప్రక్షాళన, హైడ్రా కూల్చివేతలను పరోక్షంగా ప్రస్తావిస్తూ కౌంటర్ ఇచ్చారు. అయితే, రేవంత్ రెడ్డి మాత్రం వెనక్కి తగ్గకుండా.. 'విజయన్ ఓటు వేయడం అంటే మోదీకి ఓటు వేయడమే' అని ప్రజల్లోకి తీసుకెళ్లారు. విజయన్, బీజేపీ మధ్య చీకటి ఒప్పందం ఉందని ఆయన చేసిన ప్రచారం ఓటర్లపై బలమైన ప్రభావం చూపినట్లు ప్రస్తుత ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుత ఫలితాలతో రేవంత్ రెడ్డి తన పంతాన్ని నెగ్గించుకున్నట్లు స్పష్టమవుతోంది. రేవంత్ రెడ్డి పదునైన విమర్శలు, వ్యూహాలు, ఆకర్షణీయమైన ప్రసంగాలు విజయన్ హ్యాట్రిక్ ఆశలపై నీళ్లు చల్లాయని అంటున్నారు. విజయన్ సర్కార్‌పై ఉన్న అవినీతి ఆరోపణలు, నిరుద్యోగ సమస్యలను రేవంత్ తన ప్రసంగాల్లో ఎండగట్టడం యూడీఎఫ్ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని దాని రిజల్టే ఇది అని చెబుతున్నారు. మొత్తంగా కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమైపోగా.. రేవంత్ రెడ్డి చెప్పినట్లే విజయన్‌ను ఇంటికి పంపించి, కేరళలో కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించడంలో కీలక పాత్ర పోషించారని విశ్లేషిస్తున్నారు. ఈ విజయం జాతీయ రాజకీయాల్లో రేవంత్ రెడ్డి స్థాయిని మరింత పెంచడమే కాకుండా.. రాబోయే రోజుల్లో ఆయన దక్షిణాదిలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని శక్తిగా మారబోతున్నారని సూచిస్తోందని జోష్యం చెబుతున్నారు.

# కర్నాటకలో కాంగ్రెస్ జోరు

## రెండు బైపోల్స్ లో విక్టరీ

**మహా:** కర్నాటక ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటింది. కర్ణాటకలోని బాగల్‌కోట్‌లో కాంగ్రెస్ నేత ఉమేశ్ హుల్లప్ప మేటి 22,332 ఓట్ల తేడాతో బీజేపీపై గెలుపొందారు. బీజేపీ తరఫున చరన్‌మితత్ వీరభద్రయ్య(వీరన్న) పోటీ చేశారు. కర్ణాటకలోని దావణగెరె సౌత్‌లోనూ కాంగ్రెస్ విజయ దుందుభి మోగించింది. బీజేపీ అభ్యర్థి శ్రీనివాస టి.దాసకరియప్పపై 5,708 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి సమర్థ్ మల్లికార్జున విజయం సాధించారు. దీంతో సౌత్ లో కాంగ్రెస్ కు ఎదురులేదని మరోసారి చాటింది.

# విజయ్‌కి ఫోన్ చేసిన రాహుల్ గాంధీ

## టీవీకే పార్టీ అద్భుత విజయం సాధించిందన్న రాహుల్ గాంధీ ప్రస్తుతం యువగళం పెరుగుతోందని వ్యాఖ్య

**ఢిల్లీ, మహా :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన టీవీకే పార్టీ అధినేత విజయ్‌కు లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. టీవీకే పార్టీ అధినేత విజయ్‌తో మాట్లాడానని, పార్టీ సాధించిన అద్భుతమైన ఫలితానికి ఆయనను అభినందించానని పేర్కొన్నారు. ప్రస్తుతం యువగళం పెరుగుతోందనడానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని అన్నారు. తమిళనాడు, పుదుచ్చేరిలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. తమిళనాడు, పుదుచ్చేరి ప్రజల కోసం పార్టీ పని చేస్తుందని హామీ ఇచ్చారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 100కు పైగా స్థానాల్లో విజయం సాధించింది. డీఎంకే 70కి పైగా, అన్నాడీఎంకే 50కి పైగా స్థానాలతో సరిపెట్టుకున్నాయి. పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాలలో బీజేపీ, మిత్రపక్షాలు విజయం సాధించాయి. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ అధికారం చేజిక్కించుకుంది.



# ఇది గెలుపు కాదు లూటీ

## బెంగాల్‌లో షాకింగ్ తీర్పుపై మమతా బెనర్జీ

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మమతా బెనర్జీ పార్టీ టీఎంసీ వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఈ ఓటమిపై స్పందించిన ఆమె, ఇది ప్రజాస్వామ్యబద్ధంగా వచ్చిన గెలుపు కాదని, పూర్తిగా 'లూటీ' అని ఆమె ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ఇప్పుడు బీజేపీ కమిషన్‌గా మారిందని ఆమె ఆరోపించారు. బీజేపీ సుమారు 100కు పైగా స్థానాలను లూటీ చేసిందని, దీనిపై తాము చేసిన ఫిర్యాదులను అధికారులు పట్టించుకోలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అనైతిక విజయమని, సెంట్రల్ ఫోర్సెస్, కేంద్ర మంత్రుల అండతో చేసిన అక్రమమని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా ఉన్నప్పటికీ, తృణమూల్ కాంగ్రెస్ మళ్లీ బలంగా పుంజుకుంటుందని మమతా బెనర్జీ ఆశాభావం వ్యక్తం చేశారు. అక్రమాలకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

# డిప్యూటీ సీఎంగా త్రిష..!



**మహా:** తమిళనాడు ఎన్నికల్లో హీరో విజయ్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. తొలిసారి సింగిల్‌గా బరిలోకి దిగి మ్యాజిక్ ఫిగర్ దిశగా దూసుకెళ్తున్నారు. ఊహించని విధంగా అధికార డీఎంకేతో పాటు ఏఐడీఎంకే పార్టీలకు గట్టి షాకిచ్చాడు. దీంతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా అందరి చూపు తమిళనాడుపై పడింది. ద్రవిడ రాజకీయాల్లో పోటీ చేసిన తొలిసారే సంచలనం సృష్టించిన విజయ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు విజయ్‌కు అభినందనలు చెబుతున్నారు. హీరోయిన్ త్రిష సైతం ఇంటికి వెళ్లి విజయ్‌కు శుభాకాంక్షలు చెప్పారు. ఈ నేపథ్యంలోనే త్రిష గురించి నెట్టింట చర్చ మొదలైంది. త్రిష సైతం రాజకీయాల్లో అడుగుపెట్టనుందని టాక్ వినిపిస్తోంది. అంతేకాదు.. త్రిష ఏకంగా డిప్యూటీ సీఎం కానుందని మరో టాక్ వైరలవుతోంది. విజయ్ పోటీచేసిన రెండు స్థానాల్లో గెలిస్తే.. ఒక్కచోట రాజీనామా చేయాల్సిందే. అదే సమయంలో విజయ్ రాజీనామా చేసిన స్థానంలో త్రిష పోటీ చేస్తారని లేటెస్ట్ టాక్. అలా ఎన్నికల్లో గెలిచి హీరోయిన్ త్రిష ఏకంగా డిప్యూటీ సీఎం అవుతారని సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా.. హీరో విజయ్ తిరుచ్చి ఈస్ట్, పెరంబూర్‌లో పోటీ చేసిన సంగతి తెలిసిందే.

# తమిళనాడులో హంగ్

## విజయ్ కు మద్దతిచ్చేదెవరు?

**మహా :** తమిళనాడులో డీఎంకే, అన్నా డీఎంకేల ద్విధ్రువ రాజకీయాలకు తొలిసారిగా బ్రేక్ పడింది. హీరో విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) రూపంలో మూడో రాజకీయ ప్రత్యామ్నాయం బలంగా ఆవిర్భవించింది. ఈ పార్టీ మొట్టమొదటి ఎన్నికల్లోనే సింగిల్‌గా 108 సీట్లను కైవసం చేసుకొని ప్రధాన పార్టీలను వెనక్కి నెట్టేసింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 118కి అతిస్వల్ప దూరంలో నిలిచింది. ఈ తరుణంలో మరో 10 నుంచి 12 సీట్లను కూడగట్టేందుకు ఇతర పార్టీల వైపు టీవీకే అధినేత విజయ్ చూస్తున్నారు. దీంతో చాలా ఏళ్ల తర్వాత మళ్లీ రాష్ట్రంలో హంగ్ అసెంబ్లీ ఏర్పడటం ఖాయమని స్పష్టమవుతోంది.

# దీదీ కంచుకోటపై విజయకేతనం ఎగురవేసిన బిజెపి

- గ్రేటర్ వరంగల్ నగరంలో బీజేపీ సంబరాలు
- బల్దియా పై కాషాయ జెండా ఎగురవేయడం ఖాయం
- ఎంపీ ధర్మపురి అరవింద్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు



**మహా వరంగల్ బ్యూరో;** దేశంలోని పలు రాష్ట్రాల్లో సోమవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో బిజెపి విజయకేతనం ఎగురవేసింది. జరిగిన ఎన్నికల ఫలితాలలో ముఖ్యంగా దేశమంతా ఎదురుచూసిన దీదీ కంచుకోటైన పశ్చిమ బెంగాల్ కంచుకోట ను బిజెపి బద్దలు కొట్టింది. పశ్చిమ బెంగాల్, అస్సాం తో పాటు పుదుచ్చేరి రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ ఘన విజయాలు సాధించి అధికారాన్ని చేజిక్కించుకోవడం పట్ల దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ విజయాలు దేశ ప్రజలు బీజేపీ పట్ల ఉంచిన విశ్వాసానికి, ప్రధాని నాయకత్వంలో కొనసాగుతున్న అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు పాలనకు నిదర్శనమని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, తో కలిసి బిజెపి రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఓ సిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్ రావు నివాసంలో ఒకరికొకరు స్వీట్ తినిపించుకుంటూ ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలోని పలు రాష్ట్రాల్లో సాధించిన విజయాలు బీజేపీ పై ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరిచాయని తెలిపారు. పేద మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నందుకే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. అలాగే రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కూడా భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించి మేయర్ పదవిని కైవసం చేసుకుని బల్దియా పై కాషాయ జెండాను ఎగురవేయడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. గ్రేటర్ వరంగల్ నగర అభివృద్ధి కోసం కింద కేంద్రం స్మార్ట్ సిటీ కింద నిధులు మంజూరు చేసిన విషయం మనందరికీ తెలిసిందే. నగర అభివృద్ధి కోసం బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా మరింత ఎదుగుతోందని, ప్రజలు మార్పును కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు "బీజేపీ జిందాబాద్" నినాదాలతో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. దేశవ్యాప్తంగా సాధించిన విజయాల స్ఫూర్తితో రాబోయే ఎన్నికలలో కూడా పార్టీ విజయపథంలో ముందుకు సాగుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అభినవ్ భాస్కర్, బిజెపి పార్టీ సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యే, ముఖ్య నాయకులు యువ నేతలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బిజెపి విజయభేరి

- వరంగల్ తూర్పులో అంబరన్నంటిన బిజెపి సంబరాలు
- బిజెపి అఖండ విజయం ప్రజా స్వామ్యానికి గర్వకారణం
- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



**మహా వరంగల్ బ్యూరో ;** పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో బిజెపి పార్టీ ఊహించని విధంగా దీధి కంచుకోట పై అఖండ విజయాన్ని సాధించిన సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని చౌరస్తాలో బిజెపి సీనియర్ నాయకుడు గందె నవీన్ తీన్మార్ స్టెప్పులతో అదరగొట్టగా ఆ ఉత్సాహంలో బిజెపి శ్రేణులు బాంబులు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు. జరుపుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ ఈ విజయం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం పై దేశ ప్రజలు నమ్మకం విశ్వాసం పెట్టుకుని అందించిన అఖండ విజయం అని గత దశాబ్ద కాలంగా సాగుతున్న అభివృద్ధి పాలన పై ప్రజల కున్న అచంచలమైన విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. దేశ ప్రజలు కులమతాలకు అతీతంగా, కేవలం వికాసం, అభివృద్ధి, సంక్షేమం వైపు నిలబడ్డారని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. పేదరిక నిర్మూలన, మౌలిక సదుపాయాల కల్పన, మహిళా సాధికారత తో యువతకు ఉపాధి కల్పనలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలు మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఈ అద్భుత విజయం వెనుక ధర్మం కోట్లాది మంది బిజెపి కార్యకర్తల అలుపెరుగని శ్రమ దాగి ఉందని ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ను చేరవేసి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రతి కార్యకర్తకూ ఈ విజయం అంకితమని తెలిపారు.

**ప్రజల తీర్పు....**

పశ్చిమ బెంగాల్లో గత కొన్ని దశాబ్దాలుగా రాష్ట్రంలో నెలకొన్న అవినీతి, అరాచక పాలనకు స్వస్తి పలికి, ప్రజలు 'సోనార్ బంగ్లా' (బంగారు బెంగాల్) నిర్మాణానికి మద్దతుగా నిలిచారు.

**సంక్షేమం అభివృద్ధి భద్రత**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బెంగాల్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజలు బీజేపీ పై నమ్మకం ఉంచారు. చొరబాటుదారుల సమస్యకు శాశ్వత పరిష్కారం యువతకు ఉపాధి కల్పనే బీజేపీ తక్షణ కర్తవ్యం అని తెలిపారు. ఈ అద్భుతమైన మద్దతును అందించిన పశ్చిమ బెంగాల్ ఓటర్లకు వరంగల్ బీజేపీ శ్రేణుల తరపున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, వన్నాల శ్రీరాములు, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కంభంపాటి పుల్లారావు, రత్నం సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా నాయకులు గడల కుమార్, గందె నవీన్ కుమార్, బైరి మురళీకృష్ణ, కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, మాచర్ల దీన్ దయాళ్, పొట్టి శ్రీనివాస్ గుప్తా, రాధాకృష్ణ, పొనుగోటి వెంకట్రావు, అంకాల జనార్ధన్, కూచన క్రాంతి కుమార్, మాదాసు రాజు, ముండ్రాతి వెంకటేశ్వర్లు, గోగీకార్ అనిల్ కుమార్, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బల్దియా ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలి

**మహా వరంగల్ బ్యూరో;** బల్దియా ఫిర్యాదుల పరిష్కారం పై దృష్టిసారించాలని బల్దియా అదనపు కమిషనర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు.సోమవారం జీ డబ్ల్యూ ఏం సి ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో గ్రీవెన్స్ (ప్రజావాణి ) కార్యక్రమం జరిగింది. ఈ సందర్భం గా అదనపు కమిషనర్ తో పాటు, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు నగర ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అందజేసిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాలకు చెందిన అధికారులకు అందజేశారు .ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా టౌన్ ప్లానింగ్.....48
ఇంజనీరింగ్......13
రెవిన్యూ..........11
హెల్త్ శానిటేషన్..08
నీటి సరఫరా....08
మొత్తం.... 88 గా అధికారులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ శంకర్ లింగం ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య పన్నుల అధికారి రామకృష్ణ ఎం హెచ్ ఓ డా.రాజేష్ హెచ్ ఓ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రైతులను నిండా ముంచుతున్న
# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం
### ఏనుమాముల మార్కెట్‌ను సందర్శించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

**మహా వరంగల్ బ్యూరో;** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతులను నిండా ముంచు తునన్నదని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా రైతులను అరిగోస పెడుతున్నదని రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర లేక బోనస్ ఇవ్వక చివరికి ధాన్యం కొనుగోలు విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో రైతులు పడుతున్న ఇబ్బందుల పై సోమవారం బి ఆర్ ఎస్ నాయకులు యార్డులు సందర్శించి అనంతరం నిర్వహించిన సమావేశంలో విలేకరులతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ వరంగల్ నగరంలోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ లో ఏ పని చేయాలన్న రైతుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని రైతుల ఇబ్బందులు చూస్తుంటే కడుపు తరుక్కుపోతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కనీసం గన్నీ బ్యాగులు, లారీలు అందుబాటులో లేక.. కాంటాలు కాక మార్కెట్ లో పలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దమ్ముంటే కొనుగోలు కేంద్రాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉత్సవాలు చేయాలని విమర్శించారు.మార్కెట్లలో రైతు మేళాలు నిర్వహిస్తే కాంగ్రెస్ నేతలకు రైతులే బుద్ధి చెప్తారని అన్నారు. ఈనెల 6వ తేదీకి రాహుల్ గాంధీ వరంగల్ లో రైతు డిక్లరేషన్ సభ నిర్వహించి మూడేళ్లు పూర్తి ఐయిందని అన్నారు.6 గ్యారెంటీలు, 420 హామీలు ఇవ్వడమే గాక రైతులకు సైతం అనేక హామీలు ఇచ్చారని,రైతు డిక్లరేషన్ వరంగల్ లోనే చేశారని, మూడేళ్లలో ఒక్క పథకం అయినా అమలు చేశారా అని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ కాలేదు.. రుమాఫీ రూ. 38 వేల కోట్లు అని చెప్పి 18 వేల కోట్లు మాత్రమే చేశారని,రైతు బంధు ఎగ్గొట్టారని రాష్ట్రంలో ఎక్కడా మక్కలను కొనడం లేదని మా ప్రభుత్వ హయాంలో మూడు నెలల ముందే పంట కొనుగోళ్లపై సమీక్షలు



చేసేవాళ్ళమని రైతుల దగ్గర ప్రతీదానికి డబ్బులు వసూలు చేస్తున్నారని యూరియా కోసం, నీళ్ల కోసం రైతులు గోసపడ్డారు.. పంట అమ్మలన్నా ఇబ్బంది పడుతున్నారని,గతంలో పంట నష్టపోతే రూ. 10 వేల నష్ట పరిహారం ఇచ్చామని ప్రతి ఎమ్మెల్యే, మంత్రి రైతుల సమస్యలు వినాలని,ఈ నెల 6 తారీకు లోపు పంట కొనకపోతే రైతులు మీ క్యాంపు కార్యాలయాలు ముట్టడిస్తారని రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం ఇబ్బందులు పడుతున్నారని మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళమని రైతులు బి ఆర్ ఎస్ నేతలను కోరుతున్నారన్నారు.ఎనుమాముల మార్కెట్ రైతులు గోస పడుతున్నారని,థంబ్ ఇంప్రెషన్ కోసం రైతుల దగ్గర లంచం తీసుకుంటున్నారని బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో మూడు, నాలుగు ఊర్లకు ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని కేసీఆర్ హయాంలో రైతాంగానికి ఇబ్బంది లేకుండా పంట కొనుగోలు చేశామని ఈ ప్రభుత్వం చిల్లర వేషాలు వేయడంలో నెంబర్ వన్ గా ఉందన్నారు.రైతులు కష్టపడుతుంటే రైతు ఉత్సవాలు చేసుకుంటారా ?మీ డైవర్షన్ పాలిటిక్స్ అందరికీ తెలుసని మీకు దమ్ముంటే రైతుల కళ్ళాల వద్ధ రైతు ఉత్సవాలు చేయాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో జనగామ ఎం ఎల్ ఏ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎం ఎల్ ఏ లు ఆరూరి రమేష్, పెద్ది సుదర్శన్ రెడ్డి, ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, రాకేశ్ రెడ్డి నాయకులు వాసుదేవ రెడ్డి, లలితయాదవ్, హరి రమాదేవి, చింతం యాదగిరి, కేతిరి రాజశేఖర్ తో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భారత ప్రజానీకం
# బీజేపీకే మద్దతు తెలిపిన ఎన్నికలు
### బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ



**మహా వరంగల్ బ్యూరో;** దేశ భద్రత, అభివృద్ధి, పటిష్ట నాయకత్వానికి పట్టం కట్టారని అఖండ భారతవని బీజేపీ వైపు చూస్తుందని మోదీ నాయకత్వానికి జనం మద్దతుకు నిదర్శనమే తాజా ఎన్నికల ఫలితాలు అని 2029లో కేంద్రంలో బీజేపీకే మళ్లీ పట్టం ఖాయమని ముఖ్యంగాతెలంగాణలో రాబోయేది బిజెపి పార్టీయే అధికారంలోకి వస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ అన్నారు. భారతీయ జనతాపార్టీయే దేశానికి అవసరం ఉందని మోదీ నాయకత్వంలోని కషాయదళమే ప్రజలకు కొండంత ధైర్యంగా అఖండ భారతావని మొత్తం బీజేపీ పార్టీనే కోరుకుంటున్నది. ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నా., ప్రపంచవ్యాప్తంగా స్నేహసంబంధాలు కొనసాగాలన్నా కేవలం కమల దళంతోనే సాధ్యమని జనమంతా నమ్ముతున్నారు కాబట్టే ఆ పార్టీ విజయానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, బీసీ నేత డాక్టర్ వన్నాల వెంకటరమణ అభిప్రాయపడ్డారు. సోమవారం పశ్చిమబెంగాల్, అసోం, తమిళనాడు, కేరళం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన మీడియా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ అఖండ భారతదేశం శాంతిసౌభ్రాతృత్వం కోరుకుంటున్నదని, పశ్చిమ బెంగాల్ లో బంగ్లాదేశీయులు చొరబాటును చూసి కలవరపడిన జనం అఖండ విజయాన్ని అందించి బీజేపీ ప్రభుత్వానికి మార్గాలు పరిచారన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు ముగిసిందని, ఇక బెంగాల్ పాలన తీర్చిదిద్దే ప్రక్రియను బీజేపీ పెద్దలు చూసుకుంటారని పేర్కొన్నారు. భయాందోళనలో గడుపుతున్న ప్రజలకు భారతీయ జనతాపార్టీ ఓ ఆశాజనకమైన దీపంగా కనిపిస్తున్నదని, కాంగ్రెస్ సర్కార్ పెంచిపోషించిన అరాచక శక్తుల తోకలను ఇప్పటికే కేంద్ర సర్కార్ ఎక్కడికక్కడ కత్తిరించిందని, ఇంకా చాపకింది నీరులా పాతుకుపోవాలని చూస్తున్న గుంతనక్కలను కూడా గుర్తించే పనిలో కేంద్రంలోని మోదీ సర్కార్ నిరంతరం గస్తీ కాస్తూ దేశాన్ని కాపాడుతున్న తీరును ప్రజలంతా హర్షిస్తున్నారన్నారు. ఎన్నికల వేళ ఎన్ని కుట్రలు జరిపినా, బీజేపీ శ్రేణులపై దౌర్జన్యాలకు పాల్పడి హింసాయుత ఘటనలకు తెరతీసి భయాందోళనకు గురిచేసినా ప్రజలు ఎక్కడా అధైర్యపడకుండా బీజేపీకి వెన్నుదన్నుగా నిలిచి తమ నిజమైన శక్తిని చాటుకున్నారని, ఇక వారి నమ్మకాన్ని నిజం చేసే పని బీజేపీ అధిష్టానం చూసుకుంటుందన్నారు.

**2029లో కేంద్రంలో మళ్లీ బీజేపీసర్కారే..**

దేశ ప్రజల ఊపు చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందని, దేశ భద్రతను ఇరకాటంలో పెట్టిన పార్టీలను ఇరుకున పడేసిన వారి తీరు నిజంగా సంతోషకరం అని వెంకటరమణ సంతోషం వ్యక్తం చేశారు. శత్రు దేశాలకు కొమ్ముకాస్తూ, దేశ రక్షణను అంగడిలో సరుకుగా మార్చి, నాకేంటి.., నీకేంటి... అనే ధోరణిలో లావాదేవీలు నడిపిన పార్టీల నాయకులకు ఇక కాలం చెల్లినట్టే అని ఫలితాలు రుజువు చేశాయని అభిప్రాయపడ్డారు. భారత దేశ చరిత్రను, దేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన నిజమైన అమరులను వెలుగులోకి తెస్తున్న బీజేపీపై ప్రజలు సంపూర్ణ నమ్మకంతో ఉండడం శుభపరిణామం అన్నారు. కాంగ్రెస్, ఇండియా కూటమి వంటి పార్టీలు ఎన్ని కుట్రలు, ఆరోపణలు చేసినా ఓటర్లు మాత్రం నమ్మిన సిద్ధాంతం కోసం దాడులను సైతం లెక్కచేయని ధైర్యానికి చేతులెత్తి మొక్కుతున్నట్టు తెలిపారు. దేశ భద్రతను విచ్ఛిన్నం చేసే పార్టీలకు ఏ ఎన్నికల్లోనైనా చుక్కలు చూపిస్తున్న ఓటర్ల రుణం ఎంత చేసినా తీర్చుకోలేమన్నారు. రాబోయే 2029 ఎన్నికల్లో కూడా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తప్ప మరో పార్టీకి అవకాశమే లేదని ప్రజలు ఏకపక్షంగా ఇస్తున్న తీర్పులే నిదర్శనం అన్నారు.

**తెలంగాణాలోనూ బీజేపీ సర్కారే..**

రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా భారతీయ జనతాపార్టీ గెలుపు భావుటా ఎగురవేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని వెంకటరమణ ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం ఓట్ల కోసం ప్రజల మధ్య గడిపే పార్టీలేవో., నిజమైన ప్రజాసేవకులు ఎవరో ప్రతి ఓటరు మహాశయుడికి తెలిసిపోయిందని, నిజాన్ని అర్థం చేసుకుని చెప్పుమాటలకు చెల్లుచీటీ రాస్తున్నయువత భావితరాలకు మరింత ఆదర్శంగా నిలువబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

**ప్రజల గొంతుగా ఉంటాం..**

మొత్తంగా దేశంలో అప్రతిహతంగా బీజేపీ పార్టీ తన విజయపరంపరను కొనసాగించడానికి వెంటే నడుస్తున్న ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్టు వెంకటరమణ పేర్కొన్నారు. అలాగే తమిళనాడు, కేరళం వంటి ప్రాంతీయ పార్టీల ప్రభ సాగుతున్న రాష్ట్రాల్లో కూడా బీజేపీకి మద్దతుగా నిలిచిన తీరు ఆనందకరమని, అక్కడ ఓటర్లు ఇచ్చిన ఓటు బ్యాంక్ ఎంతో విలువైనదని, రాబోయే రోజుల్లో ఆయా రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయా రాష్ట్రాల్లో ప్రతిపక్షంగా ప్రజల గొంతుకగా ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో తమ పార్టీ ఎప్పుడూ వెనకడుగు వేయదని ప్రకటించారు.



# 28వ డివిజన్‌లో బిజెపి శ్రేణుల సంబరాలు

**మహా వరంగల్ బ్యూరో;** పచ్చిమ బెంగాల్ అస్సాం పుధిచ్చేరి రాష్ట్రాలలో బీజేపీ కి తిరుగులేని మెజార్టీ అందించిన ఆ రాష్ట్రాల ప్రజలందరికి శుభాకాంక్షలు తెలుపుతూ ఇది భారత ప్రజల అఖండ విజయం అని భావిస్తూ వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని 28 డివిజన్ లో కార్పొరేటర్ గందె కల్పన నవీన్ ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేసి మోదీ జిందాబాద్.. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా రజక సెల్ కన్వీనర్ కొత్తపెల్లి రాజేష్ కిరణ్ లక్ష్మీ, కృష్ణ రాము, కళ్యాణ్ మహేష్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎంపీని సన్మానించిన ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి

**మహా వరంగల్ బ్యూరో;** ఎంపీ ధర్మపురి అరవింద్ గ్రేటర్ వరంగల్ నగరం లోని బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు నివాసానికి వచ్చిన సందర్భంగా ఆయనను ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరాల భాస్కర్ తో పాటు నవీన్ బీమ్ కదారి నవీన్ మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్చం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు.



### శ్రీశ్రీశ్రీ మల్లిఖార్జున స్వామి
# కళ్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే రంగారెడ్డి

- యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కళ్యాణ మహోత్సవం
- స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం కేంద్రంలో శ్రీశ్రీశ్రీ మల్లిఖార్జున స్వామి వారి కళ్యాణ వేడుకల్లో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం కేంద్రంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన, శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా యాదవ సోదరుల ఆహ్వానం మేరకు కళ్యాణ మహోత్సవంకి ముఖ్యఅతిగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. ఈ మేరకు భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం ప్రాంత ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో కిక్కిరిసి, మంగళవాయిద్యాలు, వేదమంత్రాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... యాదవ సోదరుల ఐక్యత, సంప్రదాయాల పరిరక్షణలో ఇలాంటి కళ్యాణ మహోత్సవాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఏసిఎస్ మాజీ చైర్మన్ పాండురంగ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈసీ శేఖర్ మామ, మంకాల దాసు, ముత్యాల రాజశేఖర్ రావు, మంగమ్మ శివకుమార్, కౌన్సిలర్ ఆకుల యాదగిరి, రాందాస్ నాయక్, యాదవ సంఘం అధ్యక్షులు ముంత శంకర్ యాదవ్, సంఘం నాయకులు, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు భారీగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## పశ్చిమ బెంగాల్ తరహాలో తెలంగాణలో బీజేపీ జెండా
# ఎగరడం ఖాయం
### బీజేపీ కౌన్సిలర్ షాబాద్ కిషన్



**మొయినాబాద్ మహా:** బెంగాల్ తరహాలో తెలంగాణలో రానున్న అసెంబ్లీ ఎనికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని మొయినాబాద్ మున్సిపల్ 4వ వార్డు బీజేపీ కౌన్సిలర్ షాబాద్ కిషన్ తెలిపారు. బిఆర్ఎస్, కాంగ్రెస్, ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి తమ సొంత ప్రయోజనాల కోసం తెలంగాణ ప్రజలను మోసం చేసి తమ కుటుంబాలు లబ్ధి పొందాయని తెలిపారు. మోదీ నాయకత్వం పై ప్రజల నమ్మకం మరింత బలపడింది తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీదే అధికారం డబుల్ ఇంజన్ సర్కార్ తో అన్ని సమస్యలు పరిష్కారం. తెలంగాణలో బీజేపీకి ప్రజాదరణ పెరిగింది తెలంగాణలో రానున్న అసెంబ్లీ ఎనికల్లో డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయమని తెలిపారు.

# ఎండలో కాకుండా ఉదయం వేలలో తూకం వేయాలి...

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తవద్దు.!
- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- రాయపోల్ రైతు కుటుంబానికి ఆర్థికసాయం....



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని, రైతులు ధాన్యం కుప్పల వద్ద వేచి ఉండకుండా, ఉదయం వేళల్లోనే తూకం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇబ్రహీంపట్నం మండలం, రాయపోల్ గ్రామంలో కొనుగోలు కేంద్రం వద్ద వడ్డ దెబ్బకు గురై, రైతు గౌరయ్య హఠామరణం చెందిన విషయం తెలిసిన ఎమ్మెల్యే రంగారెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. అతని మృతి పట్ల ఆరా తీశారు. కుటుంబసభ్యులను ఓదార్చిన మల్ రెడ్డి.... దండు మైలారం సహకార కేంద్రం నుంచి రూ.50వేల తక్షణ ఆర్థికసాయాన్ని అందజేశారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందించి, గౌరయ్య కుటుంబానికి అండగా నిలుస్తామని మల్ రెడ్డి భరోసానిచ్చారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే.... టెంట్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అవసరమైన మేర సంచులు, తూకం, తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉంచి, వీలైనంత త్వరగా పంపించాలని చెప్పారు. రైతుల పట్ల నిర్లక్ష్యధోరణి ప్రదర్శిస్తే సహించబోనని హెచ్చరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నేతలు మంకాల దాసు, కరుణాకర్, జంగారెడ్డి, దండుమైలారం పిఏసిఎస్ సంఘం సెక్రటరీ ధనరాజ్, మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# భూసార పరీక్షలు తప్పనిసరి!




- మండల వ్యవసాయ అధికారి విద్యాధరి
- పట్నంలో ప్రగతి ప్రణాళికలో వ్యవసాయ వారోత్సవాలు
- రైతులు అధికారుల సూచనలను పాటించాలి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** వ్యవసాయ వారోత్సవాల తొలి రోజు సోమవారం వ్యవసాయ శాఖ ఇబ్రహీంపట్నం వారి ఆధ్వర్యంలో 99 రోజుల ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమం ముకునూరు రైతు వేదికలో నిర్వహించడం జరిగింది.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, వ్యవసాయ వారోత్సవాల తొలి రోజు సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ముకునూరు ఉప్పరిగూడ గ్రామాలలో వ్యవసాయ శాఖ మండలాధికారి విద్యాదరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో, భూసార పరీక్ష, సాయిల్ హెల్త్ కార్డ్ ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. సమతుల ఎరువుల యాజమాన్యం, మార్కెటింగ్ కు చక్కని అవకాశం ఉన్న వారి రకాలు BPT 5204, తెలంగాణ sona, K 1638, HMT సోనా సన్న వడ్లు, దొడ్డు రకాలు IR 64, KNM 118, MTU 1010 ఎక్కువగా సాగు చేయాలని, లాభదాయకంగా కూడా ఉంటుందని అధికారులు రైతులకు సూచించారు. వెటర్నరీ డాక్టర్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ... గాలికుంటూ టీకా, అధిక దిగుబడి ఇచ్చే గడ్డి విత్తనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. డి హెచ్ఎస్ఓ సురేష్.. పంటల మార్పిడి ప్రాముఖ్యతను వివరించారు. ఎడిషనల్ డైరెక్టర్ హార్టికల్చర్ అధికారి సరోజిని, ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, వివిధ హార్టికల్చర్ పథకాల గురించి వివరించారు. తదుపరి మట్టి నమూనాలు ఇచ్చిన కొందరు రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేయడమైనది. రైతులు తమ పొలంలోని మట్టిని తప్పక పరీక్ష చేయించుకోవాలని సాయిల్ డే సందర్భంగా రైతులను కోరడమైనది. అదేవిధంగా జూన్ 2 లోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరడమైనది. ఇట్టి కార్యక్రమం లో సర్పంచ్ సన్నెల శిల్ప, ఉపసర్పంచ్ పావని, పిఎసిఎస్ రీఛార్జ్ సరస్వతి, ఉప్పరిగూడ పోల్కంపల్లి సెక్రటరీలు గణేష్, లక్ష్మయ్య, మండల వ్యవసాయ అధికారి విద్యాధరి, క్లస్టర్ గ్రామాల సెక్రటరీలు వీణ, లింగయ్య, శివకుమార్, శ్రావణ్ కుమార్, సృజన, క్లస్టర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

# బిజెపి గెలుపుతో పార్టీ కార్యాలయంలో సంబరాలు..

**రాజేంద్రనగర్, మహా ;** 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బిజెపి ఘన విజయం సాధించడంతో. నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బిజెపి ముఖ్యనాయకులతో కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కాటేదాన్ పార్టీ కార్యాలయంలో శనివారం టపాకాయలు కాలుస్తూ మిఠాయిలు తినిపిస్తూ సంబరాలు నిర్వహించారు. తోకల మాట్లాడుతూ మోదీ అమిత్ షా నాయకత్వంలో అస్సాం, పశ్చిమ్ బెంగాల్, పుదుచ్చేరి మూడు రాష్ట్రాల్లో బిజెపి గెలుపు సాధించింది అన్నారు. రాబోయే తెలంగాణ ఎన్నికలలో బిజెపి విజయం తథ్యం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, వెంకటరమణ గుప్తా, సంతోష్ కుమార్ గౌడ్, నర్సిరెడ్డి, చిన్న బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ముగ్గురు సిట్టింగ్ సీఎంలకు ఓటర్ల బిగ్ షాక్!

## దశాబ్దాల కోటలు బద్దలు.. ప్రజా తీర్పులో కుప్పకూలి మహా సామ్రాజ్యాలు



దేశ రాజకీయ చరిత్రలో ఇది కనీవినీ ఎరుగని సంచలనం. ఏళ్ల తరబడి రాష్ట్రాలను తమ గుప్పిట్లో పెట్టుకుని, 'మాకు తిరుగే లేదు.. ఎదురే లేదు' అని విర్రవీగిన ముగ్గురు ఉద్దండ ముఖ్యమంత్రులకు ఓటర్లు ఊపిరిసలపని షాక్ ఇచ్చారు. 'మీ అధికార దర్పం ఇక సాగదు' అంటూ ఓటు ఆయుధంతో వారి మహా సామ్రాజ్యాలను కూకటివేళ్లతో పెకిలించి వేశారు. తాజా అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సరళి భారత రాజకీయ ముఖచిత్రంపై పెను సునామీని సృష్టిస్తోంది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు సీఎం ఎం.కె.స్టాలిన్, కేరళ సీఎం పినరయి విజయన్.. ఈ ముగ్గురు దిగ్గజాలు తమ సొంత నియోజకవర్గాల్లోనే వెనుకంజలో ఉండటం సర్వత్రా ప్రకంపనలు రేపుతోంది. ఒకేసారి మూడు కీలక రాష్ట్రాల్లో అధికార పార్టీలు ఘోర పరాజయం దిశగా పయనించడం, అజేయులైన సీఎంల పీఠాలు కదులుతుండటం ఈ ఎన్నికల కౌంటింగ్‌లో అత్యంత సంచలనాత్మక ఘట్టంగా మారింది.

### బెంగాల్ గడ్డపై అస్తమిస్తున్న దీదీ శకం

పశ్చిమ బెంగాల్‌లో పదిహేనేళ్లుగా ఏకచ్ఛత్రాధిపత్యం చెలాయిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి ఓటర్లు గట్టి బుద్ధి చెప్పారు. కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచీ బెంగాల్ వ్యాప్తంగా కాషాయ దళం సృష్టించిన ప్రభంజనానికి టీఎంసీ కంచుకోటలు పేకమేడల్లా కూలుతున్నాయి. కోల్‌కతా, హౌరా లాంటి ప్రధాన ప్రాంతాలను సైతం బద్దలు కొడుతూ బీజేపీ ఏకంగా 170కి పైగా స్థానాల్లో ఆధిక్యం కనబరుస్తుండగా, అధికార టీఎంసీ వంద లోపు స్థానాలకే పరిమితమై దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. స్వయంగా సీఎం మమతా బెనర్జీ వెనుకంజలో ఉండటం ఆ పార్టీ శ్రేణులకు మింగుడుపడటం లేదు. క్షేత్రస్థాయిలో పెచ్చుమీరిన అవినీతి, పార్టీ క్యాడర్ సాగించిన దౌర్జన్యాలు, సందేశ్ ఖాలీ లాంటి ఘటనలు బెంగాల్ మహిళల్లో రగిల్చిన ఆగ్రహ జ్వాలలే ఇప్పుడు దీదీ సామ్రాజ్యాన్ని దహించివేస్తున్నాయని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

### ద్రవిడ నాట పాతాళానికి పడిపోయిన స్టాలిన్

తమిళనాడులో అధికార డీఎంకే పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. గత ఎన్నికల్లో 159 సీట్లతో అఖండ విజయం సాధించిన ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్.. ఇప్పుడు ఏకంగా మూడో స్థానానికి పడిపోయి దారుణ పరాభవాన్ని మూటగట్టుకుంటున్నారు. సీఎం స్టాలిన్ తో పాటు పలువురు సీనియర్ మంత్రులు ఓట్ల లెక్కింపులో వెనుకబడటం అన్నా అరివాలయంలో తీవ్ర విషాదం నింపింది. మరోవైపు నటుడు, దళపతి విజయ్ స్థాపించిన 'టీవీకే' పార్టీ రాజకీయ పండితుల అంచనాలను తలకిందులు చేస్తూ 104కి పైగా స్థానాల్లో ఆధిక్యంతో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా దూసుకుపోతోంది. కొడుకు ఉదయనిధిని అందలం ఎక్కించాలన్న స్టాలిన్ ఆరాటం, మితిమీరిన కుటుంబ పాలన పట్ల తమిళ ఓటరు తీవ్ర అసహ్యంతో రగిలిపోయాడు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలతాయన్న డీఎంకే అతివిశ్వాసాన్ని పటాపంచలు చేస్తూ, ద్రవిడ పార్టీల అహంకారానికి ఓటర్లు శాశ్వత బ్రేకులు వేశారు.

### కేరళలో పినరయికి ఎర్రజెండా చూపిన జనం

దేవుడి సొంత దేశం కేరళలో కామ్రేడ్లకు కాలం చెల్లింది. వామపక్షాల ఇనుప కవచాన్ని బద్దలు కొడుతూ కేరళ ఓటర్లు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు బ్రహ్మరథం పడుతున్నారు. ఓట్ల లెక్కింపులో యూడీఎఫ్ ఏకంగా 100కు పైగా స్థానాల్లో ఆధిక్యంలో దూసుకుపోతుండగా, అధికార ఎల్డీఎఫ్ కేవలం 30 చిల్లర స్థానాలకే పరిమితమై దారుణ పరాజయాన్ని మూటగట్టుకుంది. అత్యంత సంచలనాత్మక విషయం ఏమిటంటే.. కన్నూరులోని తన సొంత ఇలాకా ధర్మడోం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్.. కాంగ్రెస్ అభ్యర్థి వీపీ అబ్దుల్ రషీద్ చేతిలో వేలాది ఓట్ల తేడాతో వెనుకంజలో ఉండటం. విజయన్ తో పాటు ఏకంగా 13 మంది మంత్రులు ఓటమి అంచున నిలబడ్డారు. పినరయి ఒంటెద్దు పోకడలు, నియంతృత్వ విధానాలే ఈ చారిత్రక పతనానికి ప్రధాన కారణమయ్యాయి.

### పాలకుల అహంకారానికి ఓటరే వేసిన శిక్ష

ఈ ముగ్గురు ఉద్దండ ముఖ్యమంత్రుల పతనానికి ప్రధాన కారణం వారిలో గూడుకట్టుకున్న అధికార దర్పమేనని స్పష్టమవుతోంది. అధికారం శాశ్వతం అన్న భ్రమలో క్షేత్రస్థాయి వాస్తవాలను, సామాన్యుల కష్టాలను ఈ నేతలు గాలికొదిలేశారు. మమతా బెనర్జీ బుజ్జగింపు రాజకీయాలు, ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలు బెంగాల్ ప్రజలకు విసుగు తెప్పించాయి. స్టాలిన్ కేవలం తన కుటుంబాన్ని ప్రమోట్ చేసుకునే పనిలో పడి యువత ఆకాంక్షలను నీరుగార్చారు. ఇక పినరయి విజయన్ పార్టీ క్యాడర్ కంటే తన మాటే శాసనం అన్నట్లుగా వ్యవహరించి సీపీఎం పునాదులనే బలహీనపరిచారు. ఈ మూడు రాష్ట్రాల్లోని ఓటర్లు పాలకుల తప్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ.. సైలెంట్ గా ఈవీఎంల ద్వారా చావుదెబ్బ కొట్టారు.

### కొత్త ప్రత్యామ్నాయాలకు పట్టాభిషేకం

ప్రజలు కేవలం అధికార పార్టీలను ఓడించడమే కాదు, సరికొత్త ప్రత్యామ్నాయ రాజకీయాలకు పచ్చజెండా ఊపారు. తమిళనాడులో దశాబ్దాలుగా పాతుకుపోయిన ద్రావిడ పార్టీల ఆధిపత్యాన్ని పక్కన బెట్టి, మార్పు కోరుతూ దళపతి విజయ్ 'టీవీకే' వైపు నిలబడ్డారు. పశ్చిమ బెంగాల్ లో దౌర్జన్య రహిత, అభివృద్ధి కాంక్షించే పాలన కోసం దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ బీజేపీకి జైకొట్టారు. కేరళలో కమ్యూనిస్టుల ఉక్కుపాదం నుంచి స్వేచ్ఛ కోరుకుంటూ సాంప్రదాయబద్ధంగా యూడీఎఫ్ కు ఘనమైన తీర్పును అందించారు. ఎక్కడైతే పాలకులు ప్రజల గొంతు నొక్కాలని చూశారో, అక్కడే ఓటర్లు కొత్త నాయకత్వాలను ఎంచుకుని అధికార పీఠాలను కదిలించారని ఈ కౌంటింగ్ ట్రెండ్స్ నిరూపిస్తున్నాయి.

### జాతీయ రాజకీయాలపై పెను ప్రకంపనలు

ఈ మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కేవలం ఆయా ప్రాంతాలకే పరిమితం కావు, జాతీయ రాజకీయాల్లోనూ పెను మార్పులకు నాంది పలకబోతున్నాయి. జాతీయ స్థాయిలో చక్రం తిప్పాలని కలలు కన్న మమత, స్టాలిన్, పినరయి సొంత రాష్ట్రాల్లోనే ఘోరంగా చతికిలపడటం ప్రతిపక్షాల భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేయనుంది. అదే సమయంలో బెంగాల్ లో బీజేపీ సాధిస్తున్న చారిత్రక విజయం జాతీయ స్థాయిలో ఒక సరికొత్త రాజకీయ శకానికి దారితీస్తోంది. నాయకుడు ఎంతటి ఉద్దండుడైనా, పార్టీ యంత్రాంగం ఎంతున్నా.. ప్రజల మనోభావాలను విస్మరిస్తే పునాదులతో సహా పాతాళానికి తొక్కేస్తారన్న కఠోర సత్యాన్ని ఈనాటి ఫలితాలు దేశవ్యాప్తంగా ఉన్న రాజకీయ నాయకులందరికీ ఒక బలమైన హెచ్చరికగా పంపుతున్నాయి.

- మహా డెస్క్



# పలుకుబడి.. పని ఒత్తిడి



- ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, హైదరాబాద్
94408 50384

కాకతాళీయమో లేక అనర్థాలు, విషాదాలు పునరావృతం అవకూడదన్నగుండె తడో! డీసీఎం భట్టి విక్రమార్క మల్లు ముఖ్య ప్రజా సంబంధాల అధికారి (సీపీఆర్వో) మధు దశ దిన కర్మకు ముందే స్వయానా ముఖ్యమంత్రి కార్యాలయం చలించింది. అయిదు పదులకే గుండె పోటుతో మధు హఠాన్మరణంపై దిగ్భ్రాంతి చెందింది. ఇటువంటి దుఃఖ, కష్ట కాలంలో చేయాల్సిన, చేయదగిన తరుణోపాయాలపై మరింత మనసు పెట్టింది. ప్రజా సంబంధాల ఆఫీసర్లను (పీఆర్వో) కాపాడుకోవడం, అదే విధంగా నాణ్యమైన సేవలు వారి నుంచి రాబట్టేందుకు కదిలింది. మంత్రుల వ్యక్తిగత పి.ఆర్.ఓ.లు, ఆయా శాఖల పి.ఆర్.ఓ.లు సుమారు 50 మందికి సమకాలీన మెలకువల కోసం శ్రద్ధ వహించింది. వాళ్ళ విధి నిర్వహణలో సరికొత్తగా వన్ డే వర్క్ షాప్ ను సీఎం సీపీఆర్వో మల్సూర్ నేతృత్వంలో తలపెట్టి వంద శాతం విజయవంతం చేసింది. ఈ ప్రయత్నం ద్వారా ఆశాజనకమైన రిజల్ట్స్ మీద నమ్మకం పెట్టుకొంది. ఎంతో ప్రాముఖ్యత గల ఆ వర్క్ షాప్ ఐడియా, ఎగ్జిక్యూషన్ లో సీఎం పీఆర్వో బొల్గం శ్రీనివాస్ చురుకైన పాత్ర పోషించారని తెలుస్తోంది. "ఈనాడు" ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1990లలో మండల విలేకరిగా కెరీర్ మొదలుపెట్టి రాష్ట్ర స్థాయి జర్నలిజంలో విశేష అనుభవం గడించిన బొల్గం శ్రీనివాస్ కు పీఆర్వోల స్థితి, సాధకబాధకాలపై లోతైన అవగాహన ఉన్నది. సింహభాగం పీఆర్వోలు బేసిక్ గా పాత్రికేయులే. వారిని బహుళ సృజనల్లో సానబట్టేందుకు తద్వారా స్వీయ రక్షణ, మెరుగైన ఉత్పాదకతలతో ఉభయతారక ఫలితాల కోసం పూనుకొన్నారు.

ప్రభుత్వ పని తీరును సగటు ఉద్యోగి ప్రవర్తనలో పౌరులు దర్శిస్తారు. చట్ట సభల సభ్యులు, అమాత్యులు, పాలనాధిపతి సేవలను వివిధ మాధ్యమాల ద్వారా పౌర సమాజానికి తెలియజేసేందుకు ప్రజా సంబంధాల అధికారులు పాటుపడతారు. ప్రజాప్రతినిధులకు పీఆర్వోలు ఒకింత, ఒక రకంగా జ్ఞానేంద్రియాలు! ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు (లోక్ సభ, రాజ్యసభ), మంత్రులు, ముఖ్యమంత్రి దాకా వారి అడుగుజాడల్లోనే నిరంతరం పరిభ్రమిస్తూ ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారాన్ని ప్రచార, ప్రసార సాధనాలకు చేరవేయడం, ఇతరత్రా సమన్వయం చేయడం పీఆర్వోల డ్యూటీస్ లో ప్రధానం. శంఖంలో పోస్తేనే తీర్థం అన్నట్టుగా ప్రజాప్రతినిధుల కష్టం మీడియాలో కనిపిస్తేనే వాళ్ళ శ్రమించినట్టు, సేవ చేసినట్లు లెక్క! తమ సార్/మేడం వద్ద మాట రాకుండా, మాట పడకుండా సకల విధాలుగా అప్రమత్తంగా ఉండడం, ఈవెంట్స్ తదితరాలను సమర్థవంతంగా చక్కబెట్టడంలో పీఆర్వోలు లోతుగా భాగం కావాల్సిందే. ఆయా రంగాల్లో
ఏ కొందరో మినహా ఎవరూ నిమ్మలంగా ఉండని రోజులివి. ఏ స్థాయిలోని వారికి ఆ స్థాయిలో ఒత్తిడి రొటీన్ అయిన కాలమిది.
రేయింబవళ్ళు తరిమే అసైన్మెంట్ల గాభరా పొడసూపకుండా పొద్దుగుంకని, తేదీ మారని దినాలివి. ఉన్నంతలో ప్రశాంతత కూడదీసుకుని స్థితప్రజ్ఞతతో జీవించడంలోనే బతుకు దీవెన! కొన్ని వృత్తి, వ్యాపకాలు ఎట్లా ఉంటాయంటే...అప్పటిదాకా అత్యంత సాదాసీదాగా ఉన్న జిందగీలో పలుకుబడిని అమాంతం పెంచేస్తాయి. అదే సమయంలో పని భారం, బాధ్యతలు మానసిక ఒత్తిడినీ తలకు మించి మోపుతాయి.
ఆ కోవలోనివే పీఆర్వో పోస్టులు! ప్రజాప్రతినిధుల తోపాటు జిల్లా, రాష్ట్ర స్థాయి ఆఫీసర్లకూ పీఆర్వోలు ఉంటారు. ముఖ్యమంత్రి, మినిస్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు ఓఎస్డీలు, పీఏలు, పీఎస్ లు, అడిషనల్ పీఏలు, పీఆర్వోలు వగైరా ఉంటారు. వాళ్ళలో పీఆర్వోలకు తాకిడి బాగానే ఉంటుంది. ఒత్తిడీ తప్పదు. అలాగే పలుకుబడీ బాగానే పెరుగుతుంది. తమలో గర్వానికి తావు ఇవ్వకుండా,
సరైన ప్రణాళికలతోనూ, రోజు గడిచేలోగా తమకు అవకాశం ఉన్నంతలో పదుగురుకి పరోపకారం చేసిమనో, ఆత్మ సంతృప్తి పొందిన ఆనందంతోనూ ఒత్తిడిని అధిగమించొచ్చు. ఉషోదయాలను కొంగొత్తగా ఆస్వాదించవచ్చు.

# వామపక్ష ప్రభుత్వం.. ఇక గతం

**50 ఏళ్లలో తొలిసారి ఏ రాష్ట్రంలోనూ అధికారం లేదు**

**ఒకప్పుడు బెంగాల్, త్రిపుర, కేరళలో తిరుగులేని ఆధిపత్యం**

**2011లో పశ్చిమ బెంగాల్.. 2018లో త్రిపుర కోటలు బద్దలు**



**ఢిల్లీ, మహా :** ఒకప్పుడు దేశ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా వెలుగొందిన వామపక్షాలు, ఇప్పుడు దేశంలో ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేని పరిస్థితి నెలకొంది. గత ఐదు దశాబ్దాల్లో ఇలాంటి రాజకీయ శూన్యం ఏర్పడటం ఇదే తొలిసారి. తమ చివరి కంచుకోట కేరళలోనూ లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) అధికారం కోల్పోయింది. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీల భవిష్యత్తుపై తీవ్ర చర్చ జరుగుతోంది. తాజాగా కేరళలో వెలువడిన ఫలితాల ప్రకారం పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయింది. ఇక్కడ కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోయింది. దీంతో వామపక్షాలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేని చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. కేరళంలో అఖండ విజయం సాధించిన నేపథ్యంలో తిరువనంతపురంలోని కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు అంబరాన్ని తాకాయి. ఒకప్పుడు జాతీయ రాజకీయాల్లో వామపక్షాలది కీలక పాత్ర. 1996లో సీపీఎం అగ్రనేత జ్యోతి బసు యునైటెడ్ ఫ్రంట్ తరఫున ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చినా, పార్టీ పొలిట్‌బ్యూరో ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. దీనిని ఆయన తర్వాత 'చారిత్రక తప్పిదం'గా అభివర్ణించారు. 2008లో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతు ఉపసంహరించుకోవడంతో ప్రభుత్వం పార్లమెంటులో విశ్వాస పరీక్షను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ సమయంలో పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర.. ఇలా మూడు రాష్ట్రాల్లో లెఫ్ట్ పార్టీలు అధికారంలో ఉన్నాయి. భారత రాజకీయాల్లో కమ్యూనిస్టులది సుదీర్ఘ, ప్రభావవంతమైన చరిత్ర. 1957లో కేరళలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వంగా ప్రపంచ రికార్డు సృష్టించారు. ఇక, పశ్చిమ బెంగాల్‌లో 1977 నుంచి 2011 వరకు ఏకధాటిగా 34 ఏళ్లు పాలించి, దేశంలోనే సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న పార్టీగా చరిత్రకెక్కారు. జ్యోతిబసు ఒక్కరే 23 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అలాగే, త్రిపురలోనూ 1993 నుంచి మాణిక్ సర్కార్ నేతృత్వంలో వరుస విజయాలు సాధించి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. దశాబ్ద కాలంగా వామపక్షాల ప్రాభవం క్రమంగా తగ్గుతూ వచ్చింది. సింగూర్, నందిగ్రామ్ భూసేకరణ ఉద్యమాల నేపథ్యంలో 2011లో పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ చేతిలో లెఫ్ట్ ఫ్రంట్ అధికారాన్ని కోల్పోయింది. ఆ తర్వాత 2018లో బీజేపీ ప్రభంజనంలో త్రిపుర కోట కూడా బద్దలైంది. దీంతో కేరళ ఒక్కటే వామపక్షాలకు చివరి ఆశగా మిగిలింది. 2021లో రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చి పినరయి విజయన్ సంచలనం సృష్టించారు. అయితే, తాజా ఎన్నికల ఫలితాలు వామపక్షాల పాలన శకం ముగింపు దశకు తీసుకు వచ్చిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వామపభ పార్టీలు ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో తోక పార్టీలుగా మిగలగా, మరికొన్ని రాష్ట్రాలలో ఉనికి కోసం పాకులాడాలాన్ని పరిస్థితి నెలకొంది. తాజా రాజకీయ పరిణామంతో ఈ పార్టీల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

# కేరళలంలో సీఎం రేస్

## ముగ్గురిలో.. మొగ్గు ఎటో?



**మహా:** కేరళ సీఎం పదవిపై ఉత్కంఠ నెలకొంది. ముఖ్యమంత్రి రేసులో ముగ్గురు కాంగ్రెస్ అగ్ర నేతలు పోటీలో ఉన్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, అసెంబ్లీలో విపక్ష నేత వీడీ సతీశన్, పార్టీ కేరళం విభాగం మాజీ అధ్యక్షుడు రమేష్ చెన్నితాల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. రమేష్ చెన్నితాల సీనియర్ మాత్రమే కాకుండా కేసీ వేణుగోపాల్, సతీశన్ కంటే కూడా ఎక్కువ రాజకీయ అనుభవం కలిగి ఉన్నారు. కేసీ వేణుగోపాల్ వయస్సు 63 ఏళ్లు కాగా, సతీషన్ 62లోకి అడుగుపెట్టారు. చెన్నితాల ఈనెలలో 70వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నారు. ఈ ముగ్గురూ నాయర్ సామాజిక వర్గానికి చెందిన వారు కావడం విశేషం. కేరళ జనాభాలో సుమారు 12 శాతం మంది నాయర్ సామాజిక వర్గం వారున్నారు.

### కేసీ వేణుగోపాల్

కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యంగా రాహుల్ గాంధీకి విశ్వసనీయ నేతగా కేసీ వేణుగోపాల్‌కు పేరుంది. కేరళం అసెంబ్లీ ఎన్నికల్లో అసంతృప్తి నేతలను కలుపుకొని వెళ్లి పార్టీని ఏకతాటిపైకి తేవడంలో కీలక పాత్ర పోషించారు. అయితే కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా గత ఏడేళ్లలో ఆయన పలు విమర్శలు ఎదుర్కొన్నారు. విద్యార్థి నేతగా కేరళలో తన రాజకీయ జర్నీని ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో, కేంద్రంలో గతంలో మంత్రి పదవులు చేపట్టారు. ప్రస్తుతం లోక్‌సభ ఎంపీగా ఉన్నారు.

### వీడీ సతీశన్

కేరళంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుంటే సీఎం పదవికి సతీశన్ కీలక పోటీదారు. విపక్ష నేతగానే కాకుండా ఎన్నికల్లోనూ ఆయన గత ఐదేళ్లుగా కీలంగా వ్యవరించారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను గట్టి సవాళ్లు విసిరి ఆయనను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. అయితే నాయర్ కమ్యూనిటీలో ఆయన కంటే రమేష్ చెన్నితాలకే ఎక్కువ ఆదరణ ఉంది.

### రమేష్ చెన్నితాల

కేరళ కాంగ్రెస్ నేతల్లో సీనియర్ నేత రమేష్ చెన్నితాల. ముఖ్యమంత్రి అయ్యేందుకు కూడా ఇదే ఆయనకు చివరి అవకాశం. పాలనాపరమైన అనుభవంతో పాటు పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో సమర్థుడనే పేరుంది. యూడీఎఫ్ కూటమిలోని పార్టీలు కూడా ఆయనను బలంగా విశ్వసిస్తుంటాయి. తాజా ఎన్నికల్లో ఆయన క్యాంపెయిన్ కమిటీకి సారథ్యం వహించారు. కాంగ్రెస్ సాంప్రదాయం ప్రకారం తొలుత కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులతో పార్టీ అధిష్టానం నియమించిన కాంగ్రెస్ పరిశీలకులు సమావేశమవుతారు. వారి అభిప్రాయలను కేంద్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్తారు. అనంతరమే ముఖ్యమంత్రి ఎవరనే దానిపై అగ్రనాయకత్వం నిర్ణయం తీసుకుంటుంది. మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఎవరికైతే ఉంటుందో వారికే సీఎం పగ్గాలు అప్పగించే అవకాశాలు ఉంటాయి.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM
జనరల్ వార్తలు | GENERAL NEWS
మంగళవారం, హైదరాబాద్ | 05-05-2026
ANN తెలుగు

### టిఆర్ఎస్ పార్టీ అధినేతను మర్యాదపూర్వకంగా కలిసిన
## మొయినాబాద్ మున్సిపల్ యూత్ అధ్యక్షులు

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ (టీఆర్ఎస్) తెలంగాణ రక్షణ సేన పార్టీ యూత్ అధ్యక్షులు కుమ్మరి పవన్ మరియు నాయకులు కార్యకర్తలు పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత ను మర్యాదపూర్వకంగా కలిసారు కవిత మాట్లాడుతూ గ్రామ గ్రామన పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) ఏర్పాటు చేయగా అనతి కాలంలోనే కేంద్ర ఎన్నికల కమిషన్ టిఆర్ఎస్ పార్టీకి ఆమోదం తెలుపడం పట్ల సోమవారం హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కవితను కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని కుమ్మరి పవన్ పేర్కొన్నారు. పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత సూచన మేరకు చేవెళ్ల నియోజకవర్గంలో టిఆర్ఎస్ పార్టీని గ్రామ గ్రామన బలోపేతం చేయనున్నట్లు టిఆర్ఎస్



పార్టీ మొయినాబాద్ మున్సిపాలిటీ యూత్ అధ్యక్షులు కుమ్మరి పవన్ తెలిపారు

# డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

### డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ సభ్యులు
### సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ప్రజాప్రతినిధులు



**కుషాయిగూడ, మహా :** డంపింగ్ యార్డ్ సమస్యతో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని దుర్వాసన నుంచి శాశ్వత పరిష్కారం చూపి ఈ ప్రాంత వాసులకు న్యాయం చేయాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాప్రతినిధులు డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు విన్నవించారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ల సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారితో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహానగర చెత్తను నలువైపులా తరలించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని డంపింగ్ యార్డ్ ను ప్రజలకు విముక్తి కలిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జవహర్ నగర్ దమ్మాయిగూడలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని వినతిపత్రంలో మాజీ మేయర్ మేకల కావ్య, మాజీ చైర్మన్ ప్రణీతలు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హరివర్ధన్ రెడ్డి, డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు శంకర్ నారాయణ, మారం సమ్మిరెడ్డి, సంజీవరెడ్డి, స్వర్ణ శ్రీనివాస్, పద్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యను పరిష్కరిస్తాం: ఆర్డీవో అనంతరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో ప్రజలు ఆర్డీవోకు అర్జీలు అందజేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కేంద్రంలోని సోమవారం ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయంలో ఆర్డిఓ అనంతరెడ్డి అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవోకు అర్జీలు పెట్టుకున్నారు. ఆర్డిఓ మాట్లాడుతూ... ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, తమ సమస్యల




పట్ల దృష్టి సారించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని, ఆర్డిఓ అనంతరెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్, మండల స్థాయి అధికారులు, ప్రజలు పలువురు పాల్గొన్నారు.

## ధాన్యం పూర్తిగా ఎండిన తర్వాతనే మిల్లులకు తరలించాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మందమర్రి, మహా :** ధాన్యం పూర్తిగా ఎండిన తర్వాతనే మిల్లులకు తరలించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మందమర్రి మండలం సారంగపల్లి, బొక్కలగుట్టలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో ఒక భాగంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టి కేటాయించిన మిల్లులకు త్వరగా తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు,



ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని సూచించారు. రైతు వివరాలను సిస్టంలో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును ధృవీకరించాలని వివరించారు. రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి మాత్రమే రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన మార్వాడి యువమంచ్

**బెల్లంపల్లి, మహా:** అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు మార్వాడీ యువ మంచ్ చేయూతనందించడం జరిగింది. పరువురినిబెల్లంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన ఒక ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించారని జీఆర్పీ పోలీసు అధికారి మార్వాడి యువ మంచ్ మాజీ అధ్యక్షుడు ఓమ్ ప్రకాష్ మారూ కు ఫోన్ చేసి తెలియజేయడంతో వెంటనే స్పందించిన బెల్లంపల్లి శాఖ అధ్యక్షులు కృష్ణ కాంత్ సోని కి వివరాలు అందించి అంత్యక్రియల నిర్వహణకు ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు క్షేత్రస్థాయిలో సహాయ సహకారాలను అందించడం జరిగింది.ఏమాత్రం ఆలస్యం చేయకుండా మార్వాడి



యువ మంచ్ బృందం వెంటనే గుర్తుతెలియని వ్యక్తి అంత్యక్రియల కోసం 5 వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు.మార్వాడీ యువ మంచ్ సామాజిక సేవల పట్ల పలువురు హర్షం ప్రకటించారు

## రైతన్నల ఉసురు తీస్తున్న కాంగ్రెస్ సర్కార్

- జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టకుంటే ప్రభుత్వంపై తిరుగబడతాం
- రైతు గౌరయ్య కుటుంబానికి 25 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** అన్నదాతకు అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ రైతన్నల ఉసురు తీస్తున్నదని జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయపోల్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మరణించిన రైతు మంగలి గౌరయ్య చావుకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఆయన కుటుంబానికి 25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎర్రటి ఎండాకాలంలో తేమశాతం పేరిట రైతులను రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలవద్ద పడిగాపులు గాయించడం సిగ్గుచేటని విమర్శించారు. యాసంగి వరికోతలు పూర్తికావస్తున్నా ధాన్యం కొనుగోళ్లు ఇంకా మొదలు కాలేదని అన్నారు. స్వయంగా స్థానిక ఎమ్మెల్యే వారం రోజుల క్రితం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లో నేటికీ కనీసం ఒక్క గింజ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేదని చెప్పారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 15 కొనుగోలు కేంద్రాల్లో సుమారుగా 70 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయవలసి ఉండగా కనీసం రెండు వేల క్వింటాళ్లు కూడా నేటికి కొనుగోలు చేయలేదని అన్నారు. రైతులు తాము పండించిన పంటలను దళారులకు అమ్ముకున్నాకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిచే పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకుండా, వారికి బోనస్ డబ్బులు కూడా ఇవ్వకుండా మోసం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోందని అయన మండిపడ్డారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో తడిచిన ధాన్యాన్ని కూడా రైతుల నుంచి కొనుగోలు చేసామని ఆయన తెలిపారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఊరూరా కొనుగోలు కేంద్రాలు పెట్టి రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసామని గుర్తు చేశారు. 70 వేల మంది రైతుల ఖాతాల్లో 11 విడతల్లో నేరుగా 73 వేల కోట్ల రైతుబంధు నిధులు జమ చేశామని చెప్పారు. నాణ్యమైన 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చామని, ఎరువుల విత్తనాలు సకాలంలో రైతులకు అందించామని వివరించారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ, గొర్రెల పెంపకం, చేపల పెంపకం, హార్టికల్చర్, సెరికల్చర్, ఫ్లోరీకల్చర్ తదితర రంగాలలో సమృద్ధిగా అభివృద్ధి సాధించామని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో తిరిగి రైతులకు కష్టాలు వచ్చాయని , అన్నదాతలు అరిగోస పడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఖర్మానికి కాంగ్రెసును తెచ్చుకున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. ఇకనైనా కాంగ్రెస్ పాలకులు రైతుల సమస్యలపై దృష్టి సారించాలని లేదంటే రైతులతో కలిసి ప్రభుత్వంపై తిరగబడతామని ఆయన హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తగిన వసతులు కల్పించాలని , వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మాజీ వైస్ చైర్మన్ కల్వకోలు రవీందర్ రెడ్డి, దండేటికార్ రవి తదితరులు పాల్గొన్నారు.

## ఫోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

- నిందితుడికి పదివేల రూపాయల జరిమానా.. బాధితురాలికి 2 లక్షల పరిహారం
- బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు



**బెల్లంపల్లి, మహా:** ఫోక్సో కేసులో బెల్లంపల్లి పట్టణానికి చెందిన బండ సాయి కృష్ణ కు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ,పాయల జరిమానాను కోర్టు విధించినట్లు బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి పట్టణం బాబు క్యాంపు బస్తీకి చెందిన బండ సాయి కృష్ణ 2020 సంవత్సరంలో తన ఇంటికి సమీపంలో ఉన్న బాలిక పిల్లలతో కలిసి ఆడుకునేందుకు ఇంటికి రావడంతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఇంటికి వచ్చి తల్లికి ఏడుస్తూ వివరించడంతో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో బాధిత బాలికతో పాటు తో పాటు ఫిర్యాదు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అప్పటి సీఐ రాజు విచారణ జరిపి నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు పంపించారు.వాదోపవాదాలు జరిగి సాక్షులను విచారించి మంచిర్యాలకు చెందిన ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఇరువురి వాదనలు విని తదనంతరం నేరస్తుని పై నేరం చేసినట్లు నిరూపితం కావడంతో ముద్దాయికి 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష మరియు 10,000 / రూపాయల జరిమానా విధించారు . జడ్జి బాధితురాలికి 2,00000/రూపాయలు కాంపెన్సేషన్ ఇప్పించాలని డిఎల్ఎస్ఎ ని ఉత్తర్వులను జారీ చేసి ఆదేశించారు.నేరస్తునికి శిక్ష పడడానికి ముఖ్య పాత్ర వహించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్. ఏ .రాంబాబు 19 మంది సాక్షులను ప్రవేశపెట్టి తన వాదనలు వినిపించి నేరాన్ని రుజువు చేయడంలో కీలకపాత్ర పోషించారు. నేరాన్ని రుజువు చేయడం లో భరోసా బృందం సహకరించడం జరిగింది.మంచిర్యాల డిసిపి ఏగ్గడి. భాస్కర్ తోబాటు బెల్లంపల్లి ఏసీపి వి.కిరణ్ కుమార్ పర్యవేక్షణ లో సాక్షులను ప్రవేశపెట్టడానికి సహకరించిన బెల్లంపల్లి వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాస రావు తో పాటు పోలీసు శాఖ సిబ్బందిని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ అభినందనలు ప్రకటించారు.

## బ్యాంకులు, బంగారు దుకాణాల్లో భద్రత పెంచాలి..

మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి..

**మణుగూరు, మహా :** మణుగూరు సబ్ డివిజన్ పరిధిలోని బ్యాంకు అధికారులు, బంగారు నగల దుకాణాల వ్యాపారులతో డీఎస్పీ రవీందర్ రెడ్డి సోమవారం సమావేశమయ్యారు. మణుగూరు డీఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడారు. బ్యాంకులు, బంగారు షాపుల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఇటీవల రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో, కరీంనగర్లోని ఓ బంగారు నగల దుకాణంలో తుపాకులతో దోపిడీకి పాల్పడిన ఘటనల వంటి పరిణామాలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకులు, బంగారు షాపుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, అలారం వ్యవస్థలు, భద్రతా సిబ్బంది ఏర్పాటు చేయాలని సూచించారు. నగదు, బంగారం లావాదేవీల సమయంలో అపరిచితుల కదలికలపై నిఘా పెట్టాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులను



గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. దుకాణాలు తెరవడం, మూసివేసే సమయాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో లాకింగ్ వ్యవస్థలు పటిష్ఠంగా ఉండాలని చెప్పారు. బ్యాంకుల వద్ద పార్కింగ్ ప్రాంతాలు, ప్రవేశ ద్వారాల వద్ద సీసీ కెమెరాల కవరేజ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మణుగూరు సీఐ నాగబాబు, బయ్యారం ఎస్సై సురేష్, కరకగూడెం ఎస్సై పివిఎన్ రావు, అశ్వాపురం ఎస్సై రాజేష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, వ్యాపారులు భద్రతా అంశాలపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

## మండల వ్యాప్తంగా రైతు వారోత్సవం

- భూసార పరీక్షలతో రైతుకు మేలు
- మండల వ్యవసాయ శాఖ అధికారి దీపక్ ఆనంద్

**జూలూరుపాడు, మహా:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రైతు వారోత్సవం కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా అన్ని రైతు వేదికలలో సోమవారం ప్రారంభించడం జరిగింది. మండల పరిధి పడమట నర్సాపురం రైతు వేదికలో జరిగిన రైతు వారోత్సవం లో మండల వ్యవసాయ శాఖ అధికారి దీపక్ ఆనంద్ పాల్గొని మాట్లాడారు. మే 4వ తేదీ నుండి 9వ తేదీ వరకు రైతు వారోత్సవం నిర్వహించబడుతుందని తెలిపారు. రైతు వారోత్సవం మొదటిరోజు భూసార పరీక్షలు వాటి ఆవశ్యకత గురించి రైతులకు వివరించారు. భూసార పరీక్షలతో రైతుకు మేలు జరుగుతుందని అన్నారు. తద్వారా భూమికి కావలసిన సూక్ష్మ పోషకాలతో పాటు, ఎరువుల వినియోగం కూడా తగ్గుతుందని అన్నారు. అనవసరపు ఎరువులను తగ్గించి అవసరమైన పోషకాలను అందించే వీలుంటుందని, తద్వారా



రైతుకు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. రైతులు తమ పంట పొలాలలో మట్టి నమూనా సేకరించే సమయంలో గెట్ల వెంబడి మట్టిని, చెట్ల నీడలో ఉన్న మట్టిని, సేంద్రియ ఎరువు వేసిన ప్రాంతంలో మట్టిని సేకరించకూడదని తెలిపారు. మట్టి నమూనా సేకరించే పద్ధతిని రైతులకు ప్రత్యక్షంగా చేసి చూపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీపక్ ఆనంద్, గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి, ఏఈఓ గోపికృష్ణ తోపాటు, రైతులు లేళ్ళ అప్పిరెడ్డి, తెల్లబోయిన మల్లికార్జునరావు, మువ్వ శ్రీనివాసరావు, జెల్లా సురేష్, సంగం చిన్నరాజు, వెలగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం యూనిట్ వేతన ఒప్పందాల అమలుకు మద్దతుగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్న రిలే నిరాహార దీక్ష



**బూర్గంపహాడ్ మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ భద్రాచలం యూనిట్ లో వేతన ఒప్పందాల అమలు విషయంలో కార్మికుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. 13వ వేతన ఒప్పందంలోని పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, అలాగే 14వ వేతన ఒప్పందాన్ని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (JAC)తో చర్చించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు.ఈ దీక్షకు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై కార్మికులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్మికుల ఐక్యతతోనే హక్కులు సాధ్యమవుతాయని పేర్కొన్న ఎమ్మెల్యే, శాంతియుత మార్గంలో పోరాటాన్ని కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, జిల్లా స్థాయి నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్మింగ్ పూల్‌ను పర్యవేక్షించిన డీ.జీ.ఎం

**మందమర్రి, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మందమర్రి ఏరియా మందమర్రి రామకృష్ణాపూర్ లో స్విమ్మింగ్ పూల్‌ను డీ.జీ.ఎం (పర్సనల్) సిహెచ్. అశోక్ సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన స్విమ్మింగ్ పూల్ వద్ద ఉన్న వసతులను, నీటి శుద్ధీకరణ ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం స్విమ్మింగ్ కోచ్‌లకు, ఈత నేర్చుకుంటున్న వారికి ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ స్విమ్మింగ్ పూల్ వద్ద నిర్దేశించిన ప్రాథమిక సూత్రాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.ఈత నేర్చుకునే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోచ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వివరించారు.



భద్రతా ప్రమాణాల విషయంలో రాజీ పడకూడదని డీజీఎం అశోక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్, స్విమ్మింగ్ పూల్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రతి రైతు భూమికి భూసార పరీక్షలు..

రైతు వారోత్సవాల్లో మండల ఏఓ రాహుల్ రెడ్డి..

**మణుగూరు, మహా :** ప్రతి ఒక్క రైతు సాగు భూమికి భూసార పరీక్షలు చేయించుకుని, భూమిలోని పోషకాల స్థాయిని తెలుసుకుని ఎరువుల వినియోగం చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి రాహుల్ రెడ్డి సూచించారు. మణుగూరు మండలం గుట్టమల్లారం రైతువేదికలో నిర్వహించిన రైతు వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భూమికి అవసరమైన పోషకాల సమతుల్యతను బట్టి సరైన మోతాదులో, సరైన సమయంలో, సరైన ప్రదేశంలో ఎరువులు వేయాలని తెలిపారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ, జీవన ఎరువులను ప్రోత్సహించాలని రైతులకు సూచించారు.మణుగూరు క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ కొమరం లక్ష్మణ్ రావు మాట్లాడుతూ.. పంటల అనంతరం అవశేషాలను కాల్చరాదని హెచ్చరించారు. ఇలా చేయడం వల్ల భూమిలోని మిత్ర సూక్ష్మజీవులు నశించి భూసారం తగ్గిపోతుందని తెలిపారు. పచ్చిరొట్టలను పెంచి భూమిలో కలియదున్నడం ద్వారా సూక్ష్మపోషకాలు పెరుగుతాయని చెప్పారు. అనంతరం పైలట్ ప్రాజెక్టు కింద భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు భూసార పరీక్ష కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో భూసార పరీక్షలు చేయించుకుంటామని ప్రతిజ్ఞ చేయించి, భూసార నమూనాలను ఎలా సేకరించాలో అధికారులు స్వయంగా ప్రదర్శించి వివరించారు. కార్యక్రమంలో గుట్టమల్లారం సర్పంచ్ కారం పూజిత, లంకమల్లారం సర్పంచ్ పూనెం రమేష్, కట్టుమల్లారం సర్పంచ్ జగిడి ప్రసాద్, ఇప్పలసింగారం సర్పంచ్ పాల్వంచ రాములు, తోగూడెం సర్పంచ్ మడకం కృష్ణ, కూనవరం సర్పంచ్ ఎనిక శ్వేతా, పగిడేరు సర్పంచ్ కుంజా శ్రవణ్ కుమార్, ఉపసర్పంచ్ కనకయ్య, భూసార నమూనా సేకరణ వాలంటీర్లు బత్తుల శ్రీను, కొండ్రు మల్లేష్, తోటకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి రాములు లతో కలిసి ప్రజావాణి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం గంగారం గ్రామపంచాయతీ సర్పంచ్ జాడి రాజ్ కుమార్ గ్రామంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు వినియోగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన బల్మూరి పద్మ తనకు చెన్నూరు మున్సిపాలిటీలోని గేర్ర కాలనీలో ఇల్లు ఉందని, ఈ ఇంటిని ఇతరుల పేరిట నమోదు చేసి అక్రమానికి పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం రామ్ నగర్ కు చెందిన అంజయ్య తన కుమారుడికి పుట్టుకతో మూగ, చెవుడు ఉన్నాయని, యు డి ఐ డి కార్డు



కొరకు దరఖాస్తు చేసుకున్నానని, ఆ కార్డును ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్ తమ గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని తెలుపుతూ సమస్యను పరిష్కరించాలని దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన గడి కొప్పుల పద్మ తనకు గ్రామ శివారులో గల భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయమై తగు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చెన్నూరు పట్టణం శ్రీనగర్ కాలనీకి చెందిన అఫ్రోజ్ నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆయన సూచించారు. అంతకుముందు బెల్లంపల్లి డివిజన్ పరిధిలో బెల్లంపల్లి తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో నోడల్ అధికారిగా రాజస్వ మండల అధికారిని నియమించి తగు చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు స్వీకరించిన 30 రోజులలోగా పరిష్కరించాలని, లేని పక్షంలో తిరస్కరణ, అందుకు గల కారణాలతో దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల సంబంధిత వివరాలను పోర్టల్ లో నమోదు చేసి అర్జీదారులకు రసీదు అందించాలని అన్నారు. దరఖాస్తుదారులు ప్రజావాణి పోర్టల్ లో తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు.

### ఇందిరమ్మ నమోనా గృహాన్ని ప్రారంభించిన
### భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ నమూనా గృహాన్ని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. నమూనా గృహం ద్వారా ఇళ్ల నిర్మాణంపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కలుగుతుందని, నాణ్యమైన గృహ నిర్మాణ విధానాలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని అర్హులైన ప్రతి కుటుంబం సొంత గృహాన్ని నిర్మించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పథకం అమలులో అధికారులు సమర్థవంతంగా పనిచేస్తూ, ప్రజలకు పూర్తి సహకారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పట్టణ, మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# విజయ్ విన్.. టాలీవుడ్ హీరోల ప్రశంసలు

విజయ్ గెలుపుతో కోలీవుడ్‌లో సంబురాలు చేసుకుంటున్నారు. ఈ విజయాన్ని కోలీవుడ్ నటీనటులు చాలా స్పెషల్‌గా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. నటుడు జీవా విజిల్స్ వేస్తూ కనిపించారు. ఆయనతో మరో కమెడియన్ సైతం విజిల్‌స్‌తో సందడి చేశారు. తమిళనాడు వ్యాప్తంగా పలువురు సినీ ప్రముఖులు విజయ్‌కు అభినందనలు చెబుతున్నారు. అంతేకాకుండా తమిళ హీరో, నిర్మాత విశాల్, నటి ఖుష్బు సుందర్, కమల్ హాసన్, జీవీ ప్రకాశ్ కుమార్ విజయ్‌ను అభినందించారు.



**టాలీవుడ్ హీరోల ప్రశంసలు..**

దళపతి విజయ్‌కు టాలీవుడ్ స్టార్స్ సైతం అభినందనలు చెబుతున్నారు. విజయ్ గెలుపుపై మెగాస్టార్ చిరంజీవి ట్వీట్ చేశారు. మొదటి ఎన్నికలోనే అద్భుతమైన విజయం సాధించారని కొనియాడారు. మీ లక్ష్యం, నాయకత్వంతో పనిచేస్తూ ప్రజలకు సేవ చేస్తూనే ఉండాలని ఆకాంక్షించారు. తమిళనాడు ఎన్నికల్లో అద్భుతమైన విజయాన్ని సాధించినందుకు మహేశ్ బాబు అభినందనలు తెలిపారు. ప్రజలు మీపై ఉంచిన అపారమైన నమ్మకానికి ఈ విజయం నిదర్శనమని ప్రశంసించారు. ఈ పాలనలో తమిళనాడు మరింత పురోగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహేశ్‌బాబుతో పాటు టాలీవుడ్ హీరోలు రవితేజ, విజయ్ దేవరకొండ, సందీప్ కిషన్, నాని, శర్వానంద్, సాయితేజ్, శ్రీవిష్ణు, మంచు మనోజ్ సోషల్ మీడియాలో అభినందనలు తెలిపారు. దర్శకుడు అనిల్ రావిపూడి సైతం విజయ్ విజయంపై ట్వీట్ చేశారు.

**కాజల్ అగర్వాల్ ట్వీట్..**

తమిళనాడులో విజయ్ గెలుపుపై హీరోయిన్ కాజల్ అగర్వాల్ ఆనందం వ్యక్తం చేసింది. ఈ అద్భుతమైన విజయంపై హృదయపూర్వక అభినందనలు అంటూ పోస్ట్ చేసింది. మీ దార్శనికతకు, మీ పట్టుదలకు, మీపై ప్రజలకు ఉన్న అచంచలమైన ప్రేమకు నిజమైన నిదర్శనమని కొనియాడింది. తమిళనాడు ప్రజలు తమ తీర్పునుస్పష్టంగా చెప్పారని ప్రశంసించింది. ఇది కేవలం ఒక విజయం కాదు.. లక్షలాది మందితో అనుబంధానికి జరుపుకునే వేడుకని అభినందించారు. కాగా.. తుపాకీ, మెర్సల్, జిల్లా చిత్రాల్లో విజయ్ సరసన కాజల్ నటించారు.

# బాక్సులు బద్దలయ్యే ఇంట్రడక్షన్?



దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ) మెగా ఎంట్రీకి రంగం సిద్ధం చేస్తున్నారు. ఆయన దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఓ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ, లోహిత్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే ప్రీప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. త్వరలోనే దర్శకుడు బాబీ షూట్‌ని మొదలుపెట్టనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు మెగాస్టార్ ఇంట్రడక్షన్ సీన్‌ని తీసేందుకు ఆయన రంగం సిద్ధం చేస్తున్నారట. ఈ ఎంట్రీ సీక్వెన్స్ కోసం ప్రస్తుతం భారీ సెట్‌స్‌ని నిర్మిస్తున్నారు. ఈ సీక్వెన్స్‌లో మెగాస్టార్‌ని కొత్తగా చూపించేందుకు బాబీ ప్రణాళికలు రచిస్తున్నారు. చిరంజీవితోపాటు మొత్తం నలభై మంది ఫైటర్స్ కూడా ఈ సీక్వెన్స్‌లో కనిపిస్తారట. కుటుంబ భావోద్వేగాలే ప్రధానంగా సాగే ఈ కథలో చిరంజీవి పాత్ర చిత్రణ అభిమానులు పండుగ చేసుకునేలా ఉంటుందని సమాచారం. గతంలో చిరు, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఈ సినిమా అంతకు మించి ఉంటుందని డైరెక్టర్ టీమ్ చెబుతున్నది. సంక్రాంతికి సినిమాను విడుదల చేయాలనే ఉద్దేశంతో నిర్మాతలు ఉన్నారు.



# ఆ బ్యాగ్‌లో ఏముంది?

ఓ బ్యాగ్ చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ది రెడ్ బ్యాగ్'. కబీర్‌సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక ప్రధాన పాత్రధారులు. రవికుమార్ సీరపు దర్శకుడు. హరికృష్ణ సోమిశెట్టి నిర్మాత. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్నది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయి. తాజాగా థాయ్‌లాండ్‌లో కీలక సన్నివేశాలను, పాటను షూట్ చేశారు. థాయిలాండ్‌లో చిత్రీకరించిన సీన్స్ సినిమాకే హైలెట్‌గా నిలుస్తాయి. కబీర్‌సింగ్ ఇందులో డిఫరెంట్ పాత్రలో కనిపిస్తారు. అతి త్వరలో ఈ సినిమా టీజర్‌ని, త్వరలోనే సినిమాను విడుదల చేయనున్నారు. స్నేహాసింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బదల్, భార్గవి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి రచన: విక్రమ్ రాజా, కెమెరా: ప్రియేష్ గురుసామి, సంగీతం: శేఖర్ మోపరి

# రాకాలో అక్షయ్‌కుమార్?



దేశంలో తెరకెక్కుతున్న మోస్ట్ ఎవైటెడ్ పానిండియా చిత్రాల్లో అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' ఒకటి. అట్లీ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ ఈ పానిండియా చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మాఫియా నేపథ్యంలో సాగే ఈ సైంటిఫిక్ థ్రిల్లర్‌లో దీపికా పదుకోన్ కథానాయిక. రష్మిక మందన్నా, జాన్వీకపూర్, మృణాళ్ ఠాకూర్ కీలకపాత్రధారులు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం బాలీవుడ్ సూపర్‌స్టార్ అక్షయ్‌కుమార్ ఈ సినిమాలో ఓ ప్రత్యేకపాత్ర చేసేందుకు అంగీకారం తెలిపినట్టు తెలిసింది. వచ్చే షెడ్యూల్ నుంచి ఆయన ఈ సినిమా సెట్‌స్‌లోకి ఎంట్రీ ఇస్తారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సివుంది.



## ఈ ఏడాదిలోనే జాన్వీ కపూర్ పెళ్లి..

దేవర మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ జాన్వీ కపూర్. ప్రస్తుతం రామ్ చరణ్ సరసన పెద్ది మూవీతో తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. బుచ్చిబాబు సనా డైరెక్షన్‌లో వస్తోన్న ఈ సినిమా జూన్ 4వ తేదీన థియేటర్లలో సందడి చేయనుంది. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన ఈ సినిమా జూన్‌లో రిలీజ్ కానుంది. అయితే బాలీవుడ్ భామ జాన్వీ కపూర్‌పై గత కొద్ది రోజులుగా రూమర్స్ వస్తున్నాయి. ఈ ఏడాది జాన్వీ పెళ్లి చేసుకోనుందని బాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. తన బాయ్‌ఫ్రెండ్ శిఖర్ పహారియాను పెళ్లాడనుందని ఊహాగానాలొస్తున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో జాన్వీ కపూర్ పెళ్లి పీటలెక్కనుందని లేటేస్ట్ టాక్. ఈ నేపథ్యంలో జాన్వీ కపూర్ తండ్రి బోనీ కపూర్ స్పందించారు. తన కూతురు ఈ ఏడాదిలో పెళ్లి చేసుకోబోతోందన్న వార్తలను బోనీ కపూర్ ఖండించారు. జాన్వీ పెళ్లిపై వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదన్నారు. దీంతో పెద్ది బ్యూటీపై వస్తున్న పెళ్లి వార్తలకు చెక్ పడింది. అయితే గతంలో కాఫీ విత్ కరణ్ షోకు హాజరైన జాన్వీ కపూర్.. శిఖర్‌తో తన రిలేషన్ గురించి మాట్లాడింది. తామిద్దరం డేటింగ్‌లో ఉన్నామని తెలిపింది. అంతేకాకుండా వీరిద్దరు ఎక్కడికెళ్లినా జంటగా కనిపించడంతో వీరిద్దరు రిలేషన్‌లో ఉన్నట్లు అర్థమైపోయింది.



## యశ్‌తో ఇంటిమేట్ సీన్స్.. అదంతా నాన్‌సెన్స్

కేజీఎఫ్ స్టార్ యశ్ నటించిన యాక్షన్ మూవీ టాక్సిక్. ఈ మూవీ ఊహించని వివాదాలతో వాయిదా పడింది. జూన్ 4న రావాల్సిన ఈ సినిమా పోస్‌ట్‌పోన్ చేశారు. కొత్త రిలీజ్ డేట్‌ను మేకర్స్ ఇంకా ప్రకటించలేదు. ఈ మూవీకి గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ కియారా అద్వానీ హీరోయిన్‌గా కనిపించనుంది. అయితే తాజాగా టాక్సిక్ మూవీకి సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. కియారా తన ఇంటిమేట్ సీన్స్ కట్ చేయాలని మేకర్స్ కోరినట్లు తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ కియారా అద్వానీ దీనిపై స్పందించింది. యశ్‌తో ఇంటిమేట్ సీన్స్ తొలగించాలని తాను కోరలేదని తెలిపింది. ఇవన్నీ అబద్ధమని కొట్టిపారేశారు. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పోస్ట్ చేశారు. ఇలాంటివీ ఎవరు కూడా నమ్మవద్దని హితవు సూచించారు. ఈ మూవీ ఫైనల్ కట్ చూసిన కియారా.. కొన్ని బోల్డ్ తొలగించాలని పలు కథనాలు వెలువడ్డాయి. దీంతో హీరోయిన్ క్లారిటీ ఇవ్వాల్సి వచ్చింది. ఈ చిత్రాన్ని కెవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై నిర్మించారు. ఈ చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, రుక్మిణి వసంత్, తారా సుతారియా కీలక పాత్రల్లో నటించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com